ప్రజాశక్తి

శుక్రవారం 21 నవంబర్ 2025 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

అతీగతీ లేని విఎంసి

- వచ్చే ఏడాదితో ముగియనున్న గడువు
- కానరాని కార్పొరేటర్లు
- నిధులు రాబట్టని ప్రజాప్రతినిధులు
- ముందుకు సాగని అభివృద్ధి పనులు



ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ నగరపాలక సంస్థ కౌన్సిల్ దిక్కుమొక్కు లేకుండా పోయింది. 2026 మార్చిలో కౌన్సిల్ గడువు ముగుస్తుంది. అయితే వివిధ రకాల సమస్యలతో సతమతమవుతున్న నగర ప్రజలకు అధికార వైసిపి, కూటమి (టిడిపి, జనసేన, బిజెపి)కి చెందిన కార్పొరేటర్ల జాడ తెలియడం లేదనే విమర్శ ఉంది. నగర పరిధిలోని 64 మంది కార్పొరేటర్లలో సిపిఎం కార్పొరేటర్ మాదిరిగా నిత్యం ప్రజల్లో ఉంటూ, వారి సమస్యలపై పని చేసే వైసిపి, టిడిపి కార్పొరేటర్లు వేళ్లమీద లెక్కపెట్టవచ్చుననే చర్చ కూడా లేకపోలేదు. అయితే ప్రజలిచ్చిన అధికారాన్ని ఉపయోగించి ప్రజలకు, నగరాభివృద్ధికి కృషి చేయాల్సిన కార్పొరేటర్లు, వారి వ్యక్తిగత పనులు, స్వలాభం తప్పా...మరొకటి ఉండటం లేదనే విమర్శ బాహాటంగానే వినిపిస్తుంది.

సహజంగా కౌన్సిల్ చివరి దశకు చేరుకుంటున్న క్రమంలో ఈ నాలుగున్నరేళ్ల కాలంలో పెట్టిన ప్రతిపాదనలు, పెండింగ్‌లో ఉన్నవి, వాటి పరిస్తితి, డివిజన్లలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విడుదల కావాల్సిన నిధులు, విఎంసి ఖజానా తదతర అంశాలపై పార్టీల వారీగా కార్పొరేటర్లు సమావేశాలు నిర్వహించుకొని సమీక్షించుకోవడం, తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించడం వంటి ప్రక్రియ విఎంసిలో ఇటీవల కాలంలో మచ్చుకైనా కనిపించడం లేదు. ఈ కౌన్సిల్ ఏర్పడిన దగ్గర నుంచి నేటి వరకు ఆమోదించిన వందల సంఖ్యలోని తీర్మానాలకు అతీగతీ లేకుండా పోయింది. చేసిన తీర్మానాల్లో ప్రభుత్వానికి పంపించిన వాటిల్లో ఎన్ని పరిష్కారమయ్యాయి, ఇంకా పరిష్కారం కావాల్సినవి ఎన్ని ఉన్నాయి, వాటి పరిస్థితి ఏమిటనే దిశగా ఇటీవల కాలంలో అధికారులతో అధికారపక్షం ఒక్కటంటే ఒక్క సమావేశం జరపడం కానీ జరగలేదు. అంతేగాక చేపట్టిన అభివృద్ధి పనులు, వాటిల్లో పూర్తి అయినవి, ఇంకా పూర్తి కాకుండా వివిధ దశల్లో ఉన్న వర్క్స్, అలాగే నిధులు లభ్యత, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆయా పద్దుల కింద విడుదల కావాల్సిన వందల కోట్ల నిధులు, విఎంసి పరిధిలో ఆయా విభాగాల వారీగా బడా బాబుల నుంచి వసూలు కాకుండా నిలిచిపోయిన కోట్ల రూపాయలు డబ్బు వసూలుపై అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీల కార్పొరేటర్లు కనీసమైన శ్రద్ధ చూపిస్తున్న పరిస్థితి లేదని నిండుకున్న విఎంసి ఖజానా తీరే తేటతెల్లం చేస్తుంది. పాయింట్ ఆఫ్ ఆర్డర్‌లో సమగ్రమైన చర్చ , ఆమోదించిన ప్రతిపాదనలు, చేసిన తీర్మానాల అమలు అనేది మచ్చుకైనా కనిపించదని ఇటీవల కాలంలో కౌన్సిల్ నడక తేటతెల్లం చేస్తుంది. కార్పొరేటర్లను, విఎంసిని, ఖజానాను గాడిలో పెట్టాల్సిన నగరానికి చెందిన ప్రజాప్రతినిధులు ఇవేవి (మిగతా 2లో)



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

గ్రంథాలయాలు విజ్ఞాన సోపానాలు

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ

ప్రజాశక్తి-విజయవాడ

గ్రంథాలయాలు విజ్ఞాన సోపానాలని, ప్రతిఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ అన్నారు. 58వ జాతీయ గ్రంథాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం స్థానిక ఠాగూర్ స్మారక జిల్లా గ్రంథాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత దేశ గ్రంథాలయ ఉద్యమ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ సేవలకు గుర్తుగా ఆయన జయంతిని జాతీయ గ్రంథాలయ దినోత్సవంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆధునిక దేవాలయాలైన గ్రంథాలయాల అవశ్యకతను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఈ-బుక్స్, ఆడియో బుక్స్ వంటివి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని, ప్రతిఒక్కరూ కంప్యూటర్, మొబైల్స్, ల్యాప్‌టాప్ వంటి అధునాతన పరికరాల ద్వారా కావాల్సిన సమాచారాన్ని పొందగలుగుతున్నప్పటికి గ్రంథాల ద్వారా అందే సమాచారానికి మించినది లేదన్నారు. పుస్తక పఠనం మేథో వికాసానికి దోహదపడుతుందన్నారు. కంప్యూటర్ పఠనం ద్వారా నేత్రాలు త్వరగా దెబ్బతినే అవకాశం ఉంటుందన్నారు. పుస్తక పఠనం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. పుస్తక పఠనం ద్వారా పొందే విజ్ఞానం, సమాచారం గుర్తుండి పోతుందన్నారు. పుస్తక పఠనం నిరంతర అధ్యయనం వంటిందని, గ్రంథాలయ అవశ్యకతను నేటి తరానికి చాటి చెప్పేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా (మిగతా 2లో)



కొత్త ప్రభుత్వాసుపత్రిలో సౌకర్యాల గురించి తెలుసుకుంటున్న ఎంపి శివనాథ్

ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి కృషి

- ఎంపి కేశినేని శివనాథ్

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ

విజయవాడ కొత్త ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తానని, సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లానని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ అన్నారు. కొత్త ప్రభుత్వాసుపత్రిలోని వసతులు, సదుపాయాలు, రోగులకు అందుతున్న వైద్యాన్ని ఎంపి గురువారం పరిశీలించారు. సూపరింటెండెంట్ ఎ.వెంకటేశ్వరరావు, హెచ్‌వోడిలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించి నివేదిక తయారు చేసి ఇవ్వాలని సూపరింటెండెంట్‌ను ఎంపి కోరారు. అనంతరం ఎంపి మీడియాతో మాట్లాడుతూ కొత్త ప్రభుత్వాసుపత్రిలో రోజుకు మూడు వేల మంది అవుట్ పేషంట్లకు వైద్య సేవలు అందించటం జరుగుతుందన్నారు. ఆసుపత్రిలోని సమస్యలను ఎన్టీఆర్ జిల్లా ఇన్చార్జ్, వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఆసుపత్రిలో అత్యాధునిక మెడికల్ పరికరాలతో పాటు కేన్సర్‌కు సంబంధించిన ఆధునాతన పరికరాలు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ప్రతి నెలా ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేసి ఆసుపత్రి అభివృద్ధి పనులు వేగంగా జరిగేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో జీజీహెచ్‌లో (మిగతా 2లో)

సంక్షేమ బోర్డు అమలుకు ఉద్యమం ఉద్ధృతం

- భవన నిర్మాణ కార్మికుల ధర్నాలో సిఐటియు నేతలు
- డిఆర్ఒ, మంత్రి కార్యాలయంలో వినతులు

ప్రజాశక్తి-విజయవాడ, మచిలీపట్నం అర్బన్

సంక్షేమ బోర్డును పూర్తి స్థాయిలో అమలు చేసేంత వరకు ఉద్యమం కొనసాగుతుందని సిఐటియు నేతలు హెచ్చరించారు. సంక్షేమ బోర్డు అమలు, నిర్మాణ కార్మికుల ఉపాధి పరిరక్షణ కోరుతూ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్ సెంటర్‌లో గురువారం ధర్నా నిర్వహించారు. మచిలీపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. విజయవాడలో జరిగిన ధర్నాకు యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఆకుల శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. సంక్షేమ బోర్డును అమలు చేయకుండా భవన నిర్మాణ కార్మికులను అన్ని విధాలుగా ఇబ్బందులకు గురి చేస్తుందని విమర్శించారు. పలుమార్లు సంబంధిత అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేసినా, ఆందోళనలు నిర్వహిస్తున్నా పట్టించుకోవడంలేదని ధ్వజమెత్తారు. నిర్మాణ కార్మికులకు గుదిబండగా తయారైన 1214 మెమో రద్దు చేసి, నిర్మాణ కార్మికులకు అండగా ఉంటామని కూటమి ప్రభుత్వం చేసిన వాగ్దానాన్ని విస్మరించిందన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంక్షేమ బోర్డు భవన నిర్మాణ కార్మికులకు అందుబాటులోకి వచ్చేంత వరకు భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో పోరాడతామన్నారు. ఈ మధ్య కాలంలో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక ఉపాధి దెబ్బతిందన్నారు. బిల్డింగ్ మెటీరియల్ ధరలపై ప్రభుత్వం నియంత్రణ లేకపోవడంతో నిర్మాణ కార్మికులు ఉనికి కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. జిఎస్‌టి పెట్రోల్, డీజిల్ ధరలపై తగ్గించకుండా నిర్మాణ మెటీరియల్ ధరలు ఎలా తగ్గుతాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని అమలు చేయకపోతే భవిష్యత్తులో అన్ని సంఘాలను కలుపుకొని ఉద్యమాన్ని ఉధృతం చేస్తారని హెచ్చరించారు. అనంతరం ఎన్‌టిఆర్ జిల్లా డిఆర్ఒ ఎం.లక్ష్మీనరసింహకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో (మిగతా 2లో)



విజయవాడ ధర్నాచౌక్‌లో భవన నిర్మాణ కార్మికుల ధర్నా



మంత్రి కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నేతలు

నేడు వాయుసేనలో అవకాశాలపై సదస్సు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగ అవకాశాలపై శుక్రవారం విజయవాడ లయోలా కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ చెప్పారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని ఏవీఎస్ రెడ్డి కాన్ఫరెన్స్ హాల్లో వాయుసేన అధికారి వింగ్ కమాండర్ షేక్ యాకూబ్ అలీతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సదస్సును యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

మొదటిపేజీ తరువాయి

సంక్షేమ బోర్డు అమలుకు ఉద్యమం ఉధృతం

సిఐటియు విజయవాడ తూర్పు సిటీ సెక్రటరీ ఎన్.నాగేశ్వరరావు, నాయకులు విబి రాజు, టి.బుచ్చిబాబు, పి.గోవిందు, వి.కనకారావు, జి.కృష్ణమూర్తి, వై.ఏడుకొండలు, ఎస్.వేణుగోపాలకృష్ణ, వేములకొండ నాగమల్లేశ్వరరావు, బి.దుర్గారావు, ఎస్.రాజు, పాండు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నేతృత్వంలో మంత్రి కొల్లు రవీంద్ర కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కంచరపల్లి వేణుగోపాలరావు మాట్లాడుతూ కృష్ణాజిల్లా ఇన్చార్జి హోదాలో పనిచేస్తునన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ భవన నిర్మాణ కార్మికుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం మండల సిఐటియు కన్వీనర్ చిరువోలు జయరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి కృషి

అన్ని వసతులు సమకూరుస్తామన్నారు. కొత్త భవనం నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ వై.ఏడుకొండులు, ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్స్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ అడ్వైజర్ కమిటీ ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, టిఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్ సాయియాదవ్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన సోపానాలు

విద్యార్థులు పోటీ పరీక్షలను ఎదుర్కొనేందుకు ఉపయోగపడే పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత జి.వి.పూర్ణచంద్, స్థానిక కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి, గ్రంథాలయ కార్యదర్శి కె.రమాదేవి, జి.ఉమారాణి, వై.ధనలక్ష్మి, డి.నాగేశ్వరరావు, చంద్రిక, సివిల్స్ శిక్షకులు స్వాతి పూర్ణిమ, గుమ్మా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పటమటలో ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి-విజయవాడ: నగరంలోని పటమట హైస్కూల్ రోడ్లో ఉన్న ఆక్రమణలను నగరపాలక సంస్థ ప్రణాళికా సిబ్బంది గురువారం తొలగించారు. ఈ సందర్భంగా చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్ మాట్లాడుతూ పటమట హైస్కూల్ రోడ్డు 80 అడుగుల రోడ్డు ఉండేదని, క్రమేణా ఆక్రమణలకు గురవుతూ రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. రోడ్డుకిరువైపులా 20 అడుగుల వరకు ముందుకు వచ్చి ఆక్రమించారని, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు తమ సిబ్బందితో తొలగించి 80 అడుగుల రోడ్డు పునరుద్ధరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సామ్రాజ్యం, బిల్డింగ్ ఇన్స్పెక్టర్ కమల్ పాల్గొన్నారు.



మహిళలకు కేన్సర్ పరీక్షలు

ప్రజాశక్తి-విజయవాడ: నగరపాలక సంస్థలోని స్వయం సహాయక బృందాల మహిళలకు సఖి సురక్ష ద్వారా కేన్సర్ పరీక్షలు నిర్వహించినట్లు విజయవాడ నగరపాలక సంస్థ ప్రాజెక్ట్ ఆఫీసర్ (యుసిడి) పి.వెంకటనారాయణ తెలిపారు. మ్యాంగో మార్కెట్, విఎంసి కల్యాణ మండపం, ఐవి ప్యాలెస్, పటమట హైస్కూల్ రోడ్ వద్ద ఉన్న కనకమేడల రవీంద్ర కుమార్ కళ్యాణ మండపంలో ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడుతూ మెప్మా ఆధ్వర్యంలో ప్రభుత్వం స్వయం సహాయక బృందాలలో 35 సంవత్సరాలు దాటిన మహిళల కోసం సమగ్ర హెల్త్ క్యాంపులను నిర్వహిస్తూ, అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఎక్స్పర్ట్ జిఎస్ సుజాత, సిడిఒలు శ్రీకాంత్, జగదీశ్వరి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.



విద్యార్థులను ఆవిష్కణకర్తలుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యారంగంలో ఆవిష్కరణ సంస్కృతిని బలంగా నాటాలనే లక్ష్యంతో విజయవాడ సిద్దార్థ డీమ్డ్ టు బి యూనివర్శిటీలో రెండు రోజుల ఇన్నోవేషన్, డిజైన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ శిక్షణా కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. విద్యా వ్యవస్థలో వినూత్న మార్పులు తీసుకురావడానికి, విద్యార్థులను ఆవిష్కరణ కర్తలుగా తీర్చిదిద్దడానికి జరిగిన ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అదనపు రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ , కేవలం అకడమిక్ అంశాలు మాత్రమే ఒక సంపూర్ణ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దలేవు. ఆలోచించే శక్తిని, సమస్యలను పరిష్కరించే నైపుణ్యాన్ని, కొత్త విషయాలను, నూతన వస్తువుల ఆవిష్కరణలతో బోధనా నైపుణ్యాలు విద్యార్థులకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆరో తరగతి నుండే ఇన్నోవేషన్, డిజైన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను పాఠ్య ప్రణాళికలో భాగం చేయాలని ఆయన సూచించారు. పాఠశాలలు, విశ్వవిద్యాలయాల అంతటా ఆవిష్కరణ ఒక నిరంతర సంస్కృతిగా మారాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇన్నోవేటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎలాంగోవన్ కరియప్పన్, సిద్దార్థ డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఐటి విభాగం ప్రొఫెసర్ ఎం.సునీత, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎ.వి.రత్న ప్రసాద్, వాధ్వాని ఫౌండేషన్ ప్రతినిధి శ్రీవాత్సన్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా రైతు బజార్ల నిర్వహణ : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: రైతుబజారుల నిర్వహణలో పారదర్శకతను పాటిస్తూ ఎలాంటి అవకతవకలకు తావులేకుండా వినియోగదారులకు సేవలందించాలని రైతు బజార్లలో ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని పూర్తిగా నిషేధించేలా చర్యలు తీసుకోవాలని జూట్ క్లాత్ సంచుల అమ్మకాలకు ప్రత్యేక స్టాల్స్ను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతు బజార్ల నిర్వహణ పరిశీలనలో భాగంగా గురువారం జల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పటమట హైస్కూల్ రోడ్డులో గల రైతు బజార్ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూరగాయల విక్రయ స్టాళ్లను ధరల పట్టికలను అమ్మకాలు నిర్వహిస్తున్న రైతుల గుర్తింపు కార్డులను కలెక్టర్ నిశితంగా పరిశీలించి వినియోగదారులతో మాట్లాడి రైతు బజారు నిర్వహణపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతు బజార్ల ద్వారా వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలను నిర్దేశ రేట్ల ప్రకారం అందించాలన్నారు. కూరగాయల రేట్లకు సంబంధించిన బోర్డులు వినియోగదారులకు కనిపించేలా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అమ్మకం దారులు వినియోగదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి రైతుబజార్ల ప్రతిష్టను పెంచాలన్నారు. రైతులకు కేటాయించిన స్టాల్స్లో వారే విక్రయాలు నిర్వహించాలని, ఇతర వ్యక్తులు అమ్మకాలు నిర్వహిస్తున్నట్లు గుర్తిస్తే ఎస్టేట్ అధికారులపై చర్యలు తీసుకునేందుకు



వెనకాడబోమన్నారు. స్టాల్ను ఏ కేటగిరీ కింద కేటాయించారు? ఎవరికి కేటాయించారు? తదితర వివరాలతో కూడిన బోర్డును ప్రతి స్టాల్లో ప్రదర్శించాల్సిందేనన్నారు. విధి నిర్వహణలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. ప్లాస్టిక్ బ్యాగుల విచ్చలవిడి వినియోగంతో పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలుగుతుందని, ప్లాస్టిక్ వినియోగం దుష్పరిణామాలపై అవగాహన కల్పించడం ద్వారా ప్లాస్టిక్ వాడకం 80 శాతం వరకు తగ్గిందన్నారు. దీనిని పూర్తిగా నివారించి ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి. రాజబాబు, రైతు బజార్ ఎస్టేట్ అధికారి ఎం. రమేష్బాబు, నగరపాలక సంస్థ సిటీ ప్లానర్ కె. సంజయ్, జోనల్ కమీషనర్ షమ్మి, హెల్త్ ఆఫీసర్ డా. గోపాలా నాయక్, సిఇ సత్య కుమారి, ఎసిపి మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అతీగతీ లేని విఎంసి

తమకు పట్టవనే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. కౌన్సిల్‌తో కానీ, దాని నిబంధనలతో నిమిత్తం లేకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తూ ప్రజాప్రతినిధులు ఇష్టారాజ్యంగా పెద్ద ఎత్తున డివిజన్లలో అభివృద్ధి పనుల పేరుతో శంకుస్థాపనలు చేసుకుంటూ పోతున్నారనే విమర్శ బాహాటంగానే వినిపిస్తుంది. ప్రతి ఏటా ఏమో కానీ ఈ నాలుగేళ్ల కాలంలో కనీసంగా యువజనోత్సవాలు కూడా నిర్వహించే పరిస్థితికి విఎంసి నోచుకోలేదు.

బిల్లుల కోసం ఎదురుచూపు

అప్పుసప్పు చేసి విఎంసిలో చేసిన వివిధ అభివృద్ధి పనులకు సదరు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులకు అతీగతీ లేకుండా పోయింది. విఎంసి షూరిటీతో రూ.30 కోట్ల వరకు బ్యాంకర్లు అప్పు రూపంలో సదరు కాంట్రాక్టర్లకు ఇస్తామన్న డబ్బులో కేవలం రూ. ఎనిమిదన్నర కోట్లు మాత్రమే ఇచ్చేసిన బ్యాంక్, మిగిలిన సొమ్ము ఇవ్వలేమని తేల్చేసినట్లు సమాచారం. దీంతో పూర్తి స్థాయిలో కూడా బ్యాంక్‌ల నుంచి అప్పు రూపంలో డబ్బు రాకపోవడంతో, అనేక మంది కాంట్రాక్టర్లు తీవ్ర నిరాశ, నిరుత్సాహానికి లోనయ్యారు. నిధుల లభ్యత ఆధారంగా కాకుండా, ఇబ్బడి ముబ్బడిగా వివిధ రకాల వర్క్స్ సుమారు రూ. వంద కోట్లకు పైగా జనరల్ ఫండ్ పేరుతో చేయించిన వాటికి బిల్లుల జమలకు అతీగతీలేకుండా పోవడంతో కాళ్లరిగేలా విఎంసి చుట్టూతా పలువురు కాంట్రాక్టర్లు నిత్యం తిరగక తప్పడం లేదు. రూ. 289 కోట్ల స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణపు పనులు ఏళ్ల తరబడి ముందుకు సాగని వైనం నెలకొంది. ఇదే రీతిలో 15వ ఆర్థిక సంఘానికి సంబంధించిన రూ. 200 కోట్లకు పైగా చెల్లింపులు చేయాల్సి ఉంది. ఇదే రీతిలో ఎపి గ్రాంట్స్ రూ. 137 కోట్లు ఇలా అనేక రూపాల్లో చెల్లింపులు లేక విఎంసి ఒక్క అడుగు ముందుకు వేయలేని దయనీయ పరిస్థితిలో ఉన్నా... కూటమి ప్రభుత్వం, కౌన్సిల్‌లోని అధికార వైసిపి మిన్నకుండిపోతుండటంతో దిక్కుమొక్కు లేని కౌన్సిల్‌గా తయారైందని చెప్పక తప్పదు.

సముద్ర తీర భద్రతపై మాక్‌డ్రిల్



ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : సముద్ర తీర ప్రాంత దస్తి విభాగం పనితీరుపై సమీక్షించేందుకు కష్ణాజిల్లా పోలీసులు సాగర్ కవచ్ పేరుతో మాక్ డ్రిల్ నిర్వహించారు. మెరైన్ డిఐజి గోపీనాథ్ జెట్టి ఆదేశాల మేరకు గురువారం మచిలీపట్నంలో సాగర్ కవచ్ ఆపరేషన్ పై మెరైన్ డిఎస్పీ బాలురెడ్డి మాట్లాడుతూ సాగర్ కవచ్ అనేది భారతీయ తీర రక్షక దళం అని, సముద్ర ముప్పులను ఎదుర్కోవడానికి తీర ప్రాంత భద్రతా సంసిద్ధత కార్యకలా పాలలో భాగంగా ఈ మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తీర ప్రాంతంలో తీవ్రవాదులకు అడ్డుకట్ట వేసేందుకు ప్రతి సంవత్సరం కృష్ణాజిల్లా లో మాక్ డ్రిల్ నిర్వహిస్తారన్నారు. మాక్ డ్రిల్ నిమిత్తం రాడార్ కేంద్రం, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ బెల్ కంపెనీ, రైల్వే స్టేషన్ పలు ప్రాంతాలలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మాక్ డ్రిల్ నేపథ్యం లో రాష్ట్రవ్యాప్తంగా 1030 కిలోమీటర్ల తీర ప్రాంతంలో 21 పోలీస్ స్టేషన్ల సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సాగర్ కవచ్ కార్యక్రమం శుక్రవారం కూడా జరుగుతుందని తెలిపారు.

బిల్‌కలెక్టర్‌లకు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణాజిల్లాలో వివిధ మండలాలలోని గ్రామ పంచాయతీలలో బిల్ కలెక్టర్లగా విధులు నిర్వహిస్తున్న అర్హత కలిగిన ఎనిమిది మందికి జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించిన ఉత్తర్వులను గురువారం కలెక్టరేట్‌లోని చాంబర్ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ జే అరుణ, జిల్లా పంచాయతీ కార్యాలయ పరిపాలన అధికారి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ప్రత్యేక అవసరాలు గల బాల,బాలికలకు ఆటలు పోటీలు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల బాలబాలికలకు త్వరలో అండర్ 17 అండర్ 20 విభాగాల్లో ఆటలు పోటీలు జిల్లా స్థాయిలో నిర్వహిస్తామని సమగ్ర శిక్ష కృష్ణాజిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆర్. కుముదినిసింగ్ తెలిపారు. వీటిలో ముఖ్యంగా రన్నింగ్ ,లాంగ్ జంప్, హై జంప్, షాట్ పుట్, డిస్కస్ త్రో , జావలిన్ త్రో, క్లబ్ త్రో వంటి అంశాల్లో పోటీలు నిర్వహిస్తామని అన్నారు. ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు తమ తమ పరిధిలో ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఆటలాడగల సామర్థ్యం గల వారు ఎవరైతే ఉన్నారో వారిని గుర్తించి సిఆర్‌ఎంటిల ద్వారా భవిత సెంటర్‌లో పనిచేసే సహిత విద్య రిసోర్స్ పర్సన్‌లకు సమాచారం అందించాలన్నారు.



మాట్లాడుతున్న దేవభక్తుని చక్రవర్తి

ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలు ఆపాలని నిరసన

ప్రజాశక్తి-కంకిపాడు : ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలు ఆపాలని కోరుతూ పెనమలూరు నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని పోరంబోకు స్థలంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను వెంటనే ఆపాలన్నారు. రికార్డు అఫ్ రైట్స్ ప్రకారం రెండు ఎకరాల ఎనిమిది సెంట్లు (2.08) పోరంబోకు గ్రామకంఠంగా రికార్డుల్లో వున్నా భూమిలో అక్రమ కట్టడం నిర్మిస్తున్నారని మున్సిపల్ కమిషనర్ దష్టికి తీసుకువెళ్లినా ఆయన పట్టించుకోలేదన్నారు. ఇక్కడ ఉన్న కరెంటు మీటర్ కూడా మున్సిపల్ కమిషనర్‌పేరు మీదే వుందని, కానీ అయన పట్టనట్లు ఉండడం తగదన్నారు. పేదవాళ్లపై జులుం ప్రదర్శించే అధికారులు ఇప్పుడు ప్రభుత్వ భూమి స్వాధీనం జరుగుతుంటే మౌనంగా ఉండడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సఫాయి కర్మచారులకు సబ్సిడీపై మురుగు శుద్ధి వాహనాలు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఎన్ఎస్‌కెఎఫ్‌డిసి పథకం ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాల మంజూరుకు ఉమ్మడి కష్ణా(కష్ణా, ఎన్టీఆర్) జిల్లాలోని సఫాయి కర్మచారి వృత్తిలో ఉన్న నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి కష్ణా జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార సంఘం లిమిటెడ్, మచిలీపట్నం కార్యనిర్వాహక సంచాలకులు షేక్ షాహిద్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వాహన వ్యయం 31,67,326 రూపాయలు అని, ఇందులో 14,16,831.50 రూపాయల సబ్సిడీ లభిస్తుందని చెప్పారు. మిగిలిన 17,50, 494.50 రూపాయల మొత్తాన్ని ఎన్ ఎస్ కె ఎఫ్ డి సి ఋణం గా పొందవచ్చని తెలిపారు. ఎన్ఎస్‌కెఎఫ్ డి సి పథకం ద్వారా 2023లో ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులముల ఆర్థిక సహకార సంఘం వైస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఉమ్మడి కృష్ణా జిల్లాకు మంజూరు చేసిన 3000 లీటర్ల సామర్థ్యం గల సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాలు తిరిగి కేటాయింపు కోసం అందుబాటులో ఉన్నాయని చెప్పారు. గతంలో లబ్ధిదారులుగా ఎంపికై, ఋణాన్ని చెల్లించడంలో విఫలమైన వారి వాహనాలను పథకం షరతుల మేరకు కొత్త అర్హులైన అభ్యర్థులకు మళ్లీ మంజూరు చేస్తామన్నారు. కావున ఆసక్తి, అనుభవం కింది అర్హతలు కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు 30-11-2025 లోపు, నేరుగా కష్ణా జిల్లా ఎస్. సి .కార్పొరేషన్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తు చేసుకునేవారు. 5 మంది కలిసి ఒక గ్రూపుగా ఏర్పడి,గ్రూపులోని ప్రతి సభ్యుడు సఫాయి కర్మచారి వృత్తి దారు అయిఉండాలన్నారు. వివరాలకు 9652057244 నంబర్ ను సంప్రదించాలని చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం) : గన్నవరం పట్టణ సిపిఎం కమిటీ ఆధ్వర్యంలో గురువారం వెంకట నరసింహపురం కాలనీలోని 4, 5 రోడ్లలో స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు కాలనీలోని రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా క్షీణించి నీరు నిల్వలు ఏర్పడటం వల్ల దోమలు పెరిగి అనారోగ్యాలకు గురవుతున్నామని వివరించారు. వీధి దీపాలు సరిగా పని చేయకపోవడం వల్ల రాత్రి సమయాల్లో బయటకు రావాలంటే ఇబ్బంది పడుతున్నామని అన్నారు. ప్రస్తుతం ఉన్న మంచినీటి ట్యాంకు ప్రమాదకరమైన స్థితిలో ఉందని దానివల్ల ట్యాంక్‌లో బ్లీచింగ్ పౌడర్ లాంటివి కలపడానికి కూడా అవకాశం లేదని, శుభ్రపరిచే అవకాశం లేదని తెలిపారు. అనంతరం స్థానికులు వివరించిన సమస్యలను వినతి పత్రం రూపంలో స్థానిక సచివాలయం సిబ్బందికి నాయకులు అందజేశారు. సిపిఎం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు, మండల నాయకులు సూరగాని సాంబశివరావు, మిరుప నాగేశ్వరావు, బాబావాలి, ఉడతా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



25న సైకిల్ స్టాండ్, క్యాంటీన్‌కు వేలం పాటలు

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : మచిలీపట్నంలోని రైతు బజార్ ప్రాంగణంలో సైకిల్ స్టాండ్ క్యాంటీన్ నిర్వహణకు గాను ఒక సంవత్సరం కాలానికి వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎస్టేట్ అధికారి లంకే బలి చక్రవర్తి తెలియజేశారు. ఈనెల 25వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు జిల్లా వ్యవసాయ వాణిజ్యం మార్కెటింగ్ అధికారి కార్యాలయం ప్రాంగణంలో వేలం జరుగుతుందన్నారు. వేలంపాట ద్వారా సైకిల్ స్టాండ్ క్యాంటీన్ దక్కించుకోదలచిన వాళ్ళు 35 వేల రూపాయలు ధరావత్తుగా చెల్లించాలన్నారు. చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రైతు బజార్లు గుంటూరు వారి పేరట డిమాండ్ డ్రాఫ్ట్ సమర్పించడం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలు 24వ తేదీ సాయంత్రం 5 గంటలకు మచిలీపట్నం రైతు బజార్ ఎస్టేట్ అధికారి కార్యాలయంలో అందించాలని విజ్ఞప్తి చేశారు.

తుపాను పోరాటయోధులకు సత్కారం

ప్రజాశక్తి-అవనిగడ్డ : మొంథా తుఫాను ముందస్తు సన్నద్ధతతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చూపిన శ్రద్ధ అపూర్వమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ప్రశంసించారు. గురువారం పులిగడ్డ ఇరిగేషన్ గెస్ట్ హౌస్ వద్ద తుఫాను పోరాట యోధులకు ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రోత్సాహంతో అధికార యంత్రాంగం మొంథా తుఫాను లో సమర్థవంతంగా సేవలందించినట్లు తెలిపారు. ప్రత్యేక తుఫాన్లు, వరదలు ఎదుర్కొంటున్న ఆమనగడ్డ నియోజకవర్గంలో తాజా తుఫాను సమయంలో తమ బాధ్యతలను నిర్వహించిన ప్రతి ఒక్కరూ అభినందనీయులు అన్నారు. మచిలీపట్నం ఆర్డిఓ కే స్వాతి, డి.ఎస్.పి రాజా, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి .సాయి బాబు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఆకుల .శివరాం ప్రసాద్, చల్లపల్లి మండల ప్రత్యేక అధికారి జడ్పీ డిప్యూటీ సీఈవో ఆర్. సి. ఆనంద్ కుమార్, మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ అయ్యా. నాగరాజు, నాగాయలంక మండల ప్రత్యేక అధికారి ఆర్. ప్రతిభ, కోడూరు మండల ప్రత్యేక అధికారి హాజీ బేగ్, విద్యుత్ శాఖ డీఈఈ నడకుదుటి సుబ్రహ్మణ్యం, తాసిల్దారులు, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులను ఘనంగా సత్కరించారు.



వైసిపి కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-కోడూరు : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గురువారం కోడూరు మండలంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోటి సంతకాల, సేకరణ,రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు పాల్గొని మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వల్ల జరుగు నష్టాన్ని ప్రజలకు వివరించారు. స్వచ్ఛందంగా ప్రజలు వచ్చి సంతకాలు చేయాలని సూచించారు.కోడూరు మండలం జడ్పిటిసి యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, వైసిపి జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వెంకటనారాయణ, కోడూరు మండల కన్వీనర్ పరిశ్ర కోడూరు మండల కన్వీనర్ పరిశే మాధవరావు, పాల్గొన్నారు.



పట్టుబడిన వాహనాలు పరిశీలిస్తున్న ఎస్‌పి

బైక్ దొంగ అరెస్ట్

- 45 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



ప్రజాశక్తి-పామర్రు : అంతరాష్ట్ర మోటర్ బైక్‌ల దొంగను పామర్రు పోలీసులు గురువారం పట్టుకున్నారు. పామర్రు మండలం జుజ్జువరం గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డిని అరెస్టు చేసి నిందితుడి వద్ద రూ.22.50 లక్షల విలువ చేసే 45 ద్విచక్ర వాహనాలు రికవరీ చేశారు. రికవరీ చేసిన వాహనాలను ఎస్పీ విద్యాసాగర్ నాయుడు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణ, ఎన్టీఆర్ జిల్లాలలోని 8 పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న పామర్రు, గుడివాడ, మచిలీపట్నం, ఉయ్యూరు, కంకిపాడు, విజయవాడ తదితర ప్రాంతాలలో చోరీలకు పాల్పడ్డారని, హీరో బైక్ లే టార్గెట్ చేస్తూ దొంగిలించిన బైక్‌లను 2,3 వేల అప్పు కోసమే తాకట్టు పెట్టేవాడని తెలిపారు. 26 వాహనాల అడ్రస్సులు లభించాయని ఇంకా19 వాహనాలు ఏ స్టేషన్లో పరిధిలో చోరీ చేశాడో ధ్రువీకరణ కావలసి ఉందన్నారు. నిందితుడు తాడిపత్రి ప్రాంతానికి చెందిన వాడని, అక్కడ అతనిపై ఇప్పటికే పలు కేసులు ఉన్నాయన్నారు. ఇతను పామర్రు మండలం జుజ్జువరంకు చెందిన మహిళను వివాహం చేసుకున్నాడని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పామర్రు సీఐ వి.సుభాకర్, ఎస్సైవి. రాజేంద్రప్రసాద్, ట్రైనీ ఎస్ఐ సత్య కళ ఇతర బృందానికి రివార్డులు అందించి వారిని అభినందించారు.



బందరులో పట్టపగలే చోరీ

ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్ : తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో పట్టపగలే చోరీ జరిగిన సంఘటన గురువారం మచిలీపట్నంలో సంచలనం సృష్టించింది. నగరంలోని మాచవరం పాత తౌడు ఫ్యాక్టరీ దగ్గర మెయిన్ రోడ్‌లో రెండు ఇళ్లలో దొంగతనం జరిగినట్లు ఆ ఇంటి యజమానులు ఉద్యోగం నుంచి తిరిగి వచ్చిన తర్వాత గుర్తించారు. వెంటనే చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేయగా క్లూస్ టీం పోలీస్ జాగిలాలతో పోలీసు అధికారులు ఆధారాల కోసం పరిశీలించారు. సుమారు ఎనిమిది నవర్సల బంగారం, పదివేల క్యాష్, మరొక ఇంట్లో పది వేల రూపాయలు అపహరణ గురైనట్లు బాధితులు తెలిపారు. ఒక ఇంటి యజమాని రాజులపాటు కుమారి కొండాలమ్మ దేవస్థానంలో పనిచేస్తున్నారు. అలాగే మరొక ఇంటి యజమాని పరస సాంబశివరావు పోలాటి తిప్ప ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్నారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



ప్రజాశక్తి-ఉయ్యూరు : పట్టణంలో మీసేవ రవిగా ప్రసిద్ధిగాంచిన ప్రముఖ ఆర్యవైశ్య నాయకులు కుంచవరపు రవికుమార్ (52) బుధవారం అర్ధరాత్రి ఇంటి నుంచి అదృశ్యం అయ్యాడు. ఇటీవల తలకు గాయమవడంతో చికిత్స తీసుకుం టున్న ఆయన బుధవారం అర్ధరాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లినట్టు కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. పట్టణంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న పోలీసులు పుల్లేటి కాలవలో గాలింపు చర్యలు కూడా చేపట్టారు.

రైతుల అభివృద్ధే సహకార సంఘాల లక్ష్యం

కరెడ్ల వెంకట్ నారాయణ



ప్రజాశక్తి-మైలవరం : రైతుల అభివృద్ధే సహకార సంఘాల లక్ష్యమని మైలవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు కరెడ్ల వెంకట నారాయణ అన్నారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు గురువారం స్థానిక పిఎసిఎస్ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార వ్యవస్థ బలపడితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందన్నారు. రైతులకు అర్హతను బట్టి రుణాలు ఇచ్చి రైతులు ఆర్థికంగా ఎదగటానికి సహకార సంఘాలు ఎంతగానో తోడ్పాటును అందిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ టి జె మిల్టన్, మైలవరం ప్రభుత్వాసుపత్రి అభివద్ధి కమిటీ చైర్మన్ చారిగొండ్ల ప్రసాద్, తెలుగు యువత అధ్యక్షులు లంక లితీష్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని స్థానిక 29వ వార్డులో శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో కలిసి గురువారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులు, ముఖ్యంగా రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. రోడ్డు పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా, ప్రమాణాలకు అనుగుణంగా పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 29 వ వార్డు కౌన్సిలర్ కంచేటి గీతా రాణి, ఎర్రి నరసింహారావు, వార్డు నాయకులు కొల్లి మార్షల్ స్టాలిన్, కరణం నరసింహారావు, మల్లెల కొండయ్య, పునుగుపాటి పుల్లారావు, రాము, గుంజ లక్ష్మణ్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



విజయవాడ : పెనమలూరు మండలం కానూరులోని అన్నే శివ నాగేశ్వరావు అరుణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు "మాదకద్రవ్యాలు - ఆరోగ్యంపై ప్రభావం" అనే అంశంపై నవజీవన్ బాల భవన్ ఆద్వర్యంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ జ్యోతి చంద్రిక మాట్లాడుతూ విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి విజయలక్ష్మి మాట్లాడుతూ "మాదకద్రవ్యాలు - ఆరోగ్యంపై ప్రభావం" అనే అంశంపై చిత్రలేఖన పోటీలలో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. అనంతరం విజేతలైన సన ఫాతిమా, లిఖిత రమ్య శ్రీ, అన్వర్‌లకు బహుమతులు అందజేశారు

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



విజయవాడ : పడమటలంకలోని వల్లూరు సరోజినీదేవి నగరపాలక ఉన్నత పాఠశాలలో నవజీవన్ బాల భవన్ ఆద్వర్యంలో విద్యార్థులకు "మాదకద్రవ్యాలు - ఆరోగ్యంపై ప్రభావం" అనే అంశంపై వ్యాసరచన పోటీలు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ జె.జ్యోతి చంద్రిక మాట్లాడుతూ విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం "మాదకద్రవ్యాలు - ఆరోగ్యంపై ప్రభావం"పై వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులను వల్లూరు నగరపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు జ్యోతి రాణి అభినందించారు. విజేతలైన శరత్, జాన్ కుమార్, షణ్ముఖ రావులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వల్లూరు నగరపాలక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పి ప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

దళారులకు అమ్మి మోసపోవద్దు : జెసి



ప్రజాశక్తి - తిరువూరు : దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వం కేటాయించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మద్దతు ధరకు ధాన్యాన్ని అమ్ముకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియ రైతులకు సూచించారు. తిరువూరు మండలం లక్ష్మీపురంలో జాయింట్ కలెక్టర్ బుధవారం ధాన్యం కల్లాలను ఆర్‌డిఓ మాధవితో కలిసి పరిశీలించారు. ధాన్యం కొనుగోలులో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ధ్యానం అమ్మిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులు జమ చేస్తుందని జెసి చెప్పారు. అనంతరం విస్సన్నపేట మండలం తాటకుంట్ల గ్రామంలో జరుగుతున్న రీసర్వే వివరాలను తెలుసుకొని సంబంధిత రికార్డులను పరిశీలించారు. గ్రౌండ్ ట్రూతింగ్ నిర్ణీత వ్యవధిలో పూర్తీ చేయాలనీ సూచించారు. రెడ్డిగూడెం మండలం మద్దులపర్వ గ్రామంలో రైతులు ఆరబెట్టిన ధాన్యం కల్లాలను పరిశీలించారు. అంతకుముందు చేసి ఎ.కొండూరు మండలం కష్ణారావుపాలెం అంబేద్కర్ గురుకుల రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నబోజనాన్ని పరిశీలించారు. ఎ.కొండూరులోని వెంకట శ్రీసాయి రైస్ మిల్లును సందర్శించి రైతులకు త్వరితగతిన ధాన్యం బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలని, గన్ని బాగ్‌లు తగినన్ని సరఫరా చేయాలనీ సివిల్ సప్లై అధికారులను ఆదేశించారు.

రోడ్లను బాగుచేయాలి : వైసిపి



ప్రజాశక్తి-వత్సవాయి : పెనుగంచిప్రోలు మండల పరిధిలో ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలని వైసిపి జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్ ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి మండలంలోని ముచ్చింతాల గ్రామ పరిధిలోని రోడ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా నిత్యం ప్రయాణికుల రద్దీతో ఉండే రోడ్లు గుంతలమయంగా మారాయని తెలిపారు. దీంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ధ్వంసమైన రోడ్లకు మరమ్మతు పనులను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంపిపి సంఘం అధ్యక్షులు మార్కపూడి గాంధీ, జడ్పిటిసి సభ్యులు వూట్ల నాగమణి-నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలపై సోషల్ మీడియా ప్రభావం

విజయవాడ : విజయవాడ దుర్గాపురం ఎస్‌టివిఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులకు "బాలలపై సోషల్ మీడియా ప్రభావం" అనే అంశంపై వ్యాసరచన పోటీలు గురువారం నవజీవన్ బాల భవన్ ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సూర్యాపేట సబ్ ఇన్స్పెక్టర్ కడాలి కరుణ మాట్లాడుతూ సోషల్ మీడియా పిల్లల జీవనశైలిపై తీవ్రంగా ప్రభావం చూపిస్తుంద న్నారు. పిల్లలు అందరూ చదువుపై శ్రద్ధపెట్టాలని సూచించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలైన కే లక్ష్మీ తులసి, అలేఖ్య, షైనీలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నీతోడు మానసిక వికాసకేంద్రం జోనల్ కోఆర్డినేటర్ నజ్మా హేప్సూళ్ల, ఎస్‌టివిఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల ఇంచార్జి హెచ్‌ఎం టి.శ్రీనివాసులు. పాల్గొన్నారు.

ఎస్కార్ట్ 'రైడ్-ఆన్ రైస్ ట్రాన్స్‌ప్లాంటర్ల' ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వ్యవసాయ రంగ పరికరాలు, నిర్మాణ యంత్రాల తయారీలో అగ్రస్థానంలో ఉన్న, ప్రముఖ ఇంజినీరింగ్ సమూహాలలో ఒకటైన ఎస్కార్ట్స్ కుబోటా లిమిటెడ్ సంస్థ, రైతుల కోసం ఒక సరికొత్త ఆవిష్కరణ చేసిందని సంస్థ ఇంచార్జి ఆర్.ప్రతాప్ తెలిపారు. నగరంలోని ఓ హెూటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఇందులో భాగంగా, సంస్థ తమ శక్తివంతమైన కుబోటా బ్రాండ్ కింద మూడవ తరం రైడ్-ఆన్ రైస్ ట్రాన్స్‌ప్లాంటర్‌లను (కేప 6, కేప 8) వ్యవసాయ మార్కెట్‌కు అధికారికంగా పరిచయం చేసిందని తెలిపారు. ఈ నూతన మోడల్ జపాన్‌లో అత్యంత నాణ్యతా ప్రమాణాలతో, సాంకేతిక నైపుణ్యంతో ప్రత్యేకంగా రూపొందించబడ్డాయన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి

విజయవాడ : విజయవాడ విద్యాధరపురం జిఎన్ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులకు "బాలలపై సోషల్ మీడియా ప్రభావం" అనే అంశంపై నవజీవన్ బాల భవన్ ఆద్వర్యంలో వ్యాసరచన పోటీలు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నీతోడు మానసిక వికాసకేంద్రం జోనల్ కోఆర్డినేటర్ సిహెచ్ సాయిబాబు మాట్లాడుతూ సోషల్ మీడియా అడిక్షన్ వల్ల పిల్లలు హింసాత్మకంగా మారడమే కాకుండా వారి ఓపిక, సహనం కొరవడుతుందని తెలిపారు. అందువలన పిల్లలు అందరూ చదువుపై శ్రద్ధపెట్టి మంచిగా చదువుకోవాలని కోరారు. నీతోడు మానసిక వికాసకేంద్రం జోనల్ కోఆర్డినేటర్ ఎస్‌కె నజ్మా మాట్లాడుతూ సోషల్ మీడియా వినియోగం వల్ల పిల్లల్లో మానసిక సమస్యలు తలెత్తుతున్నాయి తెలిపారు. "బాలలపై సోషల్ మీడియా ప్రభావం" అనే అంశంపై వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులను జిఎన్ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు రవికుమార్ అభినందించారు. విజేతలైన లక్ష్మీ, జ్యోతిర్మయి, జయశ్రీలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిఎన్ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు దుర్గారావు, వసంత లక్ష్మి, జమీలా భాను పాల్గొన్నారు

దుర్గమ్మ గుడి మాస్టర్ ప్లాన్‌పై ఎంపి సమీక్ష



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానం మాస్టర్ ప్లాన్, అభివద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపి కేశినేని శివనాథ్, గుడి చైర్మన్ బొర్రా రాధాకష్ణ, ఈవో వి.కె. శీనా నాయక్ ఇతర ఇంజనీరింగ్, పోలీస్ అధికారులతో కలిసి ఆలయ అభివద్ధి ప్రణాళికలపై సమగ్రంగా చర్చించారు. గురువారం దేవస్థానం కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆలయ అభివద్ధి పనుల పురోగతి, భవిష్యత్తు ప్రణాళికలపై ప్రధానంగా చర్చించారు. ఇంజనీర్లు కె.వి.ఎస్.ఆర్. కోటేశ్వర రావు, రాంబాబు, ఇతర డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు మాస్టర్ ప్లాన్ వివరాలను ప్రజాప్రతినిధులకు వివరించారు. పశ్చిమ ఏసీపీ దుర్గా రావు, సీఐ గురు ప్రసాద్ చర్చల్లో పాల్గొని భద్రతాపరమైన అంశాలపై సూచనలు అందించారు.

శబరిమల మార్గంలో 'వి' నెట్‌వర్క్ మెరుగుదల

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అతిపెద్ద టెలికాం ఆపరేటర్ అయిన 'వి' సౌకర్యవంతమైన, సురక్షితమైన తీర్థయాత్రను నిర్ధారించడానికి వి నెట్ వర్క్‌ను విస్తరించినట్లు సంస్థ ప్రతినిధి కె.ఎస్.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కేరళలోని సన్నిధానం, పంపా, నీలక్కల్ వ్యాప్తంగా తమ కనెక్టివిటీని మెరుగుపరచడం ద్వారా యాత్రికులు శబరిమల మార్గంలో కనెక్ట్ అయి ఉండేలా చూసుకోవడానికి 'వి' తన నెట్‌వర్క్‌ను బలోపేతం చేసిందన్నారు. పతనంతిట్ట జిల్లాలో 13 కొత్త సైట్‌లను జోడించిందని, గణపతి కోవిల్, నడపంతల్, పరిపాలన కార్యాలయాలు, పంపా-సన్నిధానం ట్రెక్కింగ్ మార్గం, నీలక్కల్ పార్కింగ్, బస్ స్టాండ్ వద్ద కనెక్టివిటీని గణనీయంగా బలోపేతం చేశారని తెలిపారు.

నేడు శ్రీరాం సుబ్బారావుకు సత్కారం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: 75 సంవత్సరాలు పైబడి బంగారపు ఆభరణాల వ్యాపారంలో కొనసాగుతున్నందుకు ఏపీ జెన్ అండ్ జ్యువెలరీ ఫెయిర్, ఎపి బులియన్ మర్చంట్ అసోసియేషన్ సంయుక్తంగా ప్రత్యేక పురస్కారాన్ని జగ్గయ్యపేట మున్సిపల్ మాజీ చైర్మన్, బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాం సుబ్బారావుకు అరుదైన పురస్కారం లభించింది. ఈ నెల 21న విజయవాడ నోవాటెల్ హోటల్లో శ్రీరాం సుబ్బారావు దంపతులను బులియన్ మర్చంట్స్, జువెలరీ అండ్ జెమ్ ఫెయిర్ నిర్వాహకులు సన్మానించనున్నారు. జిల్లా నుంచి ఈ అరుదైన పురస్కారం అందుకుంటున్న ఏకైక బుల్లియన్ మర్చంట్‌గా ఘనతను శ్రీరాం సుబ్బారావు సాధించారు. ఈ సందర్భంగా షరాబు వ్యాపారులు, స్వర్ణకారులు హర్షం వ్యక్తం చేశారు.



సంతకాల సేకరణ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను రద్దు చేయాలని మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. విజయవాడలోని 38వ డివిజన్ కార్పొరేటర్ రహమతునిసా ఆధ్వర్యంలో రచ్చబండ సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. స్థానిక తాజ్ మాజిద్ వీధిలో గురువారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ప్రజల అభిప్రాయాన్ని ఆయన సేకరించారు. జిల్లాకు ఒకటి చొప్పున మెడికల్ కాలేజీ ఉండాలని మాజీ సీఎం జగన్ ఆలోచించి, వైసీపీ పాలనలో 17 మెడికల్ కాలేజీలకు శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో వైసిపి కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

జగన్ బెయిల్ రద్దు కోరుతూ త్వరలో పిటీషన్

- బుద్దా వెంకన్న

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : న్యాయవ్యవస్థలను కూడా తప్పుదోవ పట్టించే విధంగా కోర్టుకు హాజరు కాకుండా పన్నాగాలు పన్నిల పులివెందుల ఎమ్మెల్యే జగన్ మోహన్ రెడ్డి బెయిల్ రద్దు చేయాలని కోరుతూ న్యాయనిపుణుల సలహా తీసుకుని పిటిషన్ వేస్తానని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న తెలిపారు. ఆరేళ్ల తర్వాత నాంపల్లి సిబిఐ కోర్టుకు హాజరైందుకు ఎమ్మెల్యే జగన్ మోహన్‌రెడ్డి ఊరేగింపుగా వెళ్లిన ఉదంతాన్ని ఖండిస్తూ బుద్దా వెంకన్న గురు నానక్ కాలనీలో ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. దేవుడు స్క్రిప్ట్ రాశాడంటూ తరుచూ అనే జగన్ మోహన్ రెడ్డికి దేవుడు నిజమైన స్క్రిప్ట్ ఈ రోజు రాశాడన్నారు. 2020లో సీఎంగా నాంపల్లి కోర్టులో హాజరైన జగన్ ఆరేళ్ల తర్వాత పులివెందుల ఎమ్మెల్యేగా హాజరు కావడమే నిజమైన స్క్రిప్ట్ అన్నారు. కోర్టుకు ఒక్కడే వెళ్లాల్సి ఉన్నా దారి పోడువునా పెయిడ్ బ్యాచ్‌తో రెచ్చగొట్టేలా రప్పా రప్పా అంటూ నినాదాలు చేయించారని, ప్రజలను భయపెట్టిన విధంగా... కోర్టులను కూడా భయపెట్టాలని చూస్తున్నాన్నారు. జగన్ తన తప్పులను ఒప్పుకుని చట్టప్రకారం జైలుకు వెళ్లాలని డిమాండ్ చేశారు.



కొండలమ్మ ఆలయానికి విరాళం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరంలో ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థాన అభివద్ధి పనుల నిమిత్తం గురువారం గుడ్లవల్లేరుకు చెందిన గుదే వెంకటేశ్వరరావు రూ.10,116ను విరాళంగా అందజేశారు. దేవస్థాన ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు, ఈఓ ఆకుల కొండలరావు సభ్యులు తూము రాజ్యలక్ష్మి, గుడ్లవల్లేటి వాణి, ముంగం ఆంజనేయులు, కళ్ళేపల్లి సుగుణ శేఖర్, మన్నెం వీర నాగేంద్రరావు, రవీంద్ర బాబు పాల్గొన్నారు.

.

తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - గుడివాడ : గ్రామాల్లోని తాగునీటి ప్రాజెక్టుల అభివద్ధిపై దృష్టి పెట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదేశించారు. గురువారం స్థానిక ఏలూరురోడ్డులోని ప్రజావేదికలో నియోజకవర్గంలో వివిధ తాగునీటి ప్రాజెక్టులపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఎమ్మెల్యే రాము సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో తాగునీటి వ్యవస్థలను మరింత అభివద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నా మన్నా రు. ఈ క్రమంలో గుడ్లవల్లేరు మండలంలోనీ వడ్లమ న్నా డు, గుడ్లవల్లేరు, పెంజేంద్ర, గాదెపూడి, కట్టవాని చెరువు, తాడిచర్ల, లంకాదొడ్డి, పెసరమిల్లి గ్రామాల్లో కోటి యాభై లక్షల నిధులతో అభివద్ధి పనులు చేపడు తున్నట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ డి.ఈ శ్రీనివాస్, ఏఈ రూపేష్, గుడివాడ ఆర్డబ్ల్యూఎస్ ఇంచార్జ్ రాణి పాల్గొన్నారు.

ఆక్వా సాగులో ఆధునిక పద్ధతులు అనుసరించాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-ఉంగుటూరు - (బాపులపాడు) : ఆక్వా రంగంలో ఆధునిక సాగు పద్ధతుల ద్వారా రైతాంగానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. వీరవల్లి గ్రామంలోని ఆక్వా ఎక్సేంజ్ అగ్రిటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో గురువారం పర్యటించిన ఎమ్మెల్యే రాము, సంస్థ ల్యాబ్ ఆధునిక సాధనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రాము మీడియాతో మాట్లాడుతూ రైతాంగ అభ్యున్నతి కోసం 'నెక్స్ట్ ఆక్వా' పేరుతో క్షేత్రస్థాయి శిక్షణ కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఆధునిక ఆక్వా సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేలా 'ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ డిజిటల్ ట్రేసబిలిటీ' పేరుతో వారి గ్రామాల్లోనే శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఫౌండర్లు, ఆక్వా నిపుణులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ భారత ఆర్థిక నిర్మాణానికి సహకార వ్యవస్థ వెన్నెముక

- కెడిసిసి బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం



ప్రతిజ్ఞ చేస్తున్న నెట్టెం రఘురాం తదితరులు


ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : గ్రామీణ భారత ఆర్థిక నిర్మాణానికి సహకార వ్యవస్థ వెన్నెముక లాంటిదని కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షులు నెట్టెం రఘురాం అన్నారు. సహకార వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో బ్యాంక్ ఆవరణలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న బ్యాంక్ అధ్యక్షులు నెట్టెం రఘురాం సహకార జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సహకారం అనేది గ్రామీణ భారత ఆర్థిక నిర్మాణానికి వెన్నెముక. రైతులు, చిన్న వ్యాపారులు, మహిళా సంఘాలు, స్వయంసహాయక బందాల అభివద్ధికి సహకార బ్యాంకులు కీలక భూమిక పోషిస్తున్నా యన్నారు. మచిలీపట్నం కేడీసీసీ బ్యాంక్ గతంలో సాధించిన విజయాలే కాదు, భవిష్యత్తులో కూడా అత్యధిక బాధ్యతతో ప్రజలకు సేవలు అందించడానికి కట్టుబడి ఉందన్నారు. ఈ నేపద్యంలో గురువారం బ్యాంక్ ఆవరణలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం మన బ్యాంక్ సామాజిక బాధ్యతను ప్రతిబింబించే గొప్ప ఉదాహరణగా నిలిచిందన్నారు. కేడీసీసీ బ్యాంక్ సీఈఓ ఏ. శ్యామ్ మనోహర్,డి సి ఓ చంద్రశేఖర్ రెడ్డి, డిఆర్ ఫణి కుమార్, రంగబాబు జనరల్ మేనేజర్ పి.ఎల్. చంద్రశేఖర్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ట్రైసైకిల్, తోపుడు బండ్లు అందజేత



తోపుడు బండ్లు అందజేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

ప్రజాశక్తి-ఉయ్యూరు : రోటరీక్లబ్ ఆధ్వర్యంలో దివ్యాంగుడు, చిరువ్యాపారులకు రూ.65వేలు విలువ చేసే ట్రైసైకిల్, తోపుడు బండ్లు గురువారం అందజేశారు. రోటరీ నేత్రవైద్యశాల ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రవాస భారతీయురాలు వి.శారద ముఖ్య అతిధిగా హాజరై దివ్యాంగునికి ట్రైసైకిల్, ముగ్గురు చిరు వ్యాపారులకు మూడు తోపుడు బండ్లు పంపిణీచేశారు. రోటరీ కమ్యూనిటీ సర్వీస్ ట్రస్టు సెక్రటరీ వసంతరావు, రోటరీక్లబ్ అధ్యక్షుడు సీహెచ్ నాగ సుబ్రమణ్యం, పున్నారావు, సంపత్ కుమార్, అనీస్, వెంకటేశ్వరరావు అమీర్ మీర్జా, రోటరీ వైద్యశాల మేనేజర్ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గ్రామ సర్పంచ్ దాసరి విజయకుమార్

పులిగడ్డలో ఉపాధి హామీ గ్రామసభ

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని పులిగడ్డ గ్రామపంచాయతీ పరిధిలో ఎంజిఎన్‌ఆర్‌జిఈఎస్ గ్రామసభ నిర్వహించారు. గురువారం పులిగడ్డ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాసరి విజయకుమార్ పాల్గొని మాట్లాడుతూ సమస్యలు ఏమైనా ఉన్న తమ దష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించే విధంగా చూస్తామని సర్పంచ్ విజయకుమార్ హామీ ఇచ్చారు. అంతేకాకుండా గ్రామాన్ని అభివద్ధి పరచి ముందంజలో ఉంచాలని దానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ కోటేశ్వరరావు మాట్లాడుతూ వచ్చే ఏడాది పనులను గుర్తించి వాటిని గ్రామ సభలో చదివి వివరించారు. గ్రామ ఉపసర్పంచ్ మండల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాన్ని ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని దానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, వార్డ్ మెంబర్ మండలి విజయలక్ష్మి, సచివాలయం సిబ్బంది, గ్రామ ప్రజలు తదాఇతరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ ఇవ్వాలి

ప్రజాశక్తి-మొవ్వ : రెండో విడత అన్నదాత సుఖీభవ పథకంలో కౌలు రైతులన గుర్తించి పెట్టుబడి సహాయం ఇవ్వకపోవడం దారుణమని ఎపి కౌలు రైతు సంఘం కృష్ణాజిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మొదటి విడత అన్నదాత సుఖీభవలో కౌలు రైతులను విస్మరించారనీ, అక్టోబర్లో కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ జమ చేస్తామని హామీ ఇచ్చి మోసం చేశార న్నారు. వాస్తవంగా పెట్టుబడి పెట్టిన కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ ఇవ్వాలని, కానీ ప్రభుత్వం ఒక్క కౌలు రైతుకి అన్నదాత సుఖీభవ ఇవ్వకపోవడం ఇంతకంటే మించిన దారుణం మరొకటి ఉండదన్నారు.

ఉషారామాలో ముగిసిన శిక్షణా తరగతులు



ప్రజాశక్తి-ఉంగుటూరు : మండలంలోని తేలప్రోలు ఉషా రామా ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల లో గత నాలుగు రోజులుగా జరుగుతున్న శిక్షణా తరగ తులు గురువారం ముగిశాయి. ఈ సందర్బంగా కళాశాల ప్రిన్సిపాల్ జి.వి.కె.ఎస్.వి. ప్రసాద్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన సాంకేతికతను అందిపుచ్చు కోవాలన్నారు. శిక్షణలో ఎంపికైన 65 మంది విద్యార్థులు పాల్గొన్నారని ఈ శిక్షణా కార్యక్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యొక్క ప్రాథమిక భావనలు, మెషిన్ లెర్నింగ్, డేటా విశ్లేషణ మరియు నిజజీవిత అనువర్తనాలపై ప్రాజెక్టు-ఆధారిత అభ్యాసం ద్వారా విద్యార్థులు ఆచరణాత్మక జ్ఞానాన్ని పొందగలిగారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐ విభాగాధిపతి కే.వి.ఎం.సి. సత్యశ్రీ, కోఆర్డినేటర్ పి. భాగ్యశ్రీ, ఎస్. మౌనిక తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్న మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి గ్రామంలో ఉన్న శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి గురువారం దర్శించుకున్నారు. మంత్రికి స్వామివారి చిత్ర పటాన్ని, తీర్థ ప్రసాదాలు ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు అందజేశారు.



రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు గూడూరు విద్యార్థులు

ప్రజాశక్తి గూడూరు : ఈ నెల 22 నుండి 24 వరకు తిరుపతి జిల్లా చంద్రగిరిలో జరగనున్న రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు జి వి విజయ కుమారి తెలిపారు. లింగం రేమాల్య, కనగాల ఇంద్రజ,మాదాసు యజ్ఞ శ్రీ ,లింగం వీర కుమార్ ,పోగుల సంజనలు ఎంపిక కావడం పట్ల ఆమె అభినందనలు తెలిపారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్‌జిఎఫ్ కృష్ణా జిల్లా అడ్మిన్ సెక్రటరీ మత్తి అరుణ, సిహెచ్.రాజేష్ పాల్గొన్నారు.

ఆర్కే గ్రూపు హోటల్స్ ప్రారంభం

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : తెలంగాణలోని జూబ్లీహిల్స్‌లో ఆర్కె సంస్థల నూతన వ్యాపార ప్రారంభం గురువారం ఘనంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర ఉప ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజవర్గం నుండి ఎమ్మెల్యేగా ఎన్నికైన వల్లల నవీన్ యాదవ్ చేతుల మీదుగా వ్యాపారాలు ప్రారంభోత్సవాలు జరిగాయి. ఆర్కే గ్రూప్ ఆఫ్ హెూటల్స్‌లో భాగంగా ఆర్కె మసూలిపట్నం, ఆర్కె ఉగాది, ఆర్కె మసోలియా కేఫ్, ఆర్కే గుడ్ టైమ్స్ మచిలీపట్నం ఫుట్ పార్కులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్కే సంస్థల అధినేత బండి రామకృష్ణ, ఆయన కుమారుడు బండివిజయ్ తదితరులు పాల్గొన్నారు.




పశుపోషణలో వైద్యుల సూచనలు పాటించాలి : యార్లగడ్డ

ప్రజాశక్తి-ఉంగుటూరు (బాపులపాడు) : పశుపోషణ ను లాభదాయకంగా మార్చాలంటే వైద్యుల సూచనలను తప్పకుండా పాటించాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పశుపోషకులకు సూచించారు. బాపులపాడులో పశుసంవర్ధక శాఖ, స్రవంతి ట్రస్ట్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మెగా పశు వైద్య శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడుతూ, పశు పోషణ రైతులకు అదనపు ఆదాయం తెస్తుందని, కానీ ప్రస్తుతం అది భారంగా మారిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వైద్యుల సూచనలను అనుసరించడం ద్వారా దానిని మళ్లీ లాభదాయకంగా మార్చుకోవచ్చని ఆయన వివరించారు. వట్టిపోయిన పశువులను కబేళాకు విక్రయించకుండా, సరైన వైద్య చికిత్స ద్వారా వాటిని మరోసారి గర్భధారణ చేయవచ్చునని సూచించారు. స్రవంతి ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్, ఉప సర్పంచ్ దుట్టా శ్రీమన్నారాయణ, నాయకులు దయాల రాజేశ్వరరావు, ఆళ్ళ గోపాలక్రిష్ణ, మూల్పూరి సాయి కళ్యా ణి, పశుసంవర్ధక శాఖ జెడి నరసింహులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఎంఎల్ఎ యార్లగడ్డ వెంకట్రావు

రైతులకు చెక్కులు పంపిణీ



ప్రజాశక్తి-చందర్లపాడు: రైతుల అభివృద్ధే సహకార సంఘాల లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. చందర్లపాడు మండలంలోని కోనాయపాలెం గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి ప్రసాద్ ఆధ్వర్యంలో 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సౌమ్య మాట్లాడుతూ రైతుల అభివద్ధే సహకార సంఘాల లక్ష్యమని, సహకార వ్యవస్థ బలపడితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని తెలిపారు. 3 శాతం వడ్డీ రాయితీ పథకం కింద మొత్తం రూ.16,02,329ల చెక్కులను 391 మంది రైతులకు, రైతు నేస్తం, క్రాప్ లోన్ కింద నలుగురు లబ్ధిదారులకు రూ.12.50 లక్షల చెక్కులను నేరుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మార్కపూడి వెంకట్రావమ్మ, కోనాయపాలెం పీఏసిఎస్ బ్యాంక్ డైరెక్టర్లు, నందిగామ యార్డ్ వైస్ చైర్మన్ అమ్మినేని జ్వాల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఫీల్డ్ విజిట్

ప్రజాశక్తి- చందర్లపాడు: పి.ఎం ఎస్‌వికెఎం జెడ్.పి.హెచ్ హైస్కూల్‌కు చెందిన 40 మంది విద్యార్థులు గురువారం సైన్స్ ఎక్స్‌పోజర్ విజిట్ చేశారు. పాఠశాల ప్రధాన ఉపధ్యాయరాలు శ్రీలత ఆధ్వర్యంలో ఎపి కాస్ట్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, గాంధీ హిల్, ఇబ్రహీంపట్నంలోని 'పవిత్ర సంగం, అయ్యదేవర కాళేశ్వరరావు మార్కెట్, అంబేద్కర్ విగ్రహం, ప్రకాశం బ్యారేజి, రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, కృష్ణానదీ తీరంలోని ఘాట్‌లను విద్యార్థులు తిలకించారు.

బస్సులను పునరుద్ధరించాలని వినతి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట ఆర్టీసీ డిపో నుండి నడిచే ముఖ్యమైన దూర ప్రాంత బస్సు సర్వీసులును ఇటీవల రద్దు చేశారని, రద్దు చేసిన బస్సులను పునరుద్ధరించాలని ఎన్ఎం యుఎ యూనియన్ ప్రతినిధులు గురువారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) కి వినతి పత్రం అందజేశారు. డిపో నుండి కాకినాడ, శ్రీశైలం, తిరుపతికి సూపర్ లగ్జరీ బస్సులు ఇటీవల రద్దు చేశారని, ఈ కీలక సేవలను తిరిగి కొనసాగించాలని కోరారు. అలాగే జగ్గయ్యపేట-కోదాడ, జగ్గయ్యపేట-వైరా, జగ్గయ్యపేట-చింతిర్యాల రూట్లలో బస్సులను నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆయా రూట్లలో బస్సులు నడపాలని కోరారు. సిబ్బందిపై జరుగుతున్న భౌతిక దాడులపై చట్టపరమైన చర్యలు తీసుకుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షులు గంటా భాస్కరరావు, చైర్మన్ వడ్లమూడి రాంబాబు, సెక్రటరీ ఐ. నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పట్టా రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు దుస్తులు పంపిణీ



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థ కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, రెడ్ క్రాస్ ఎన్టీఆర్ జిల్లా నిర్వాహన కమిటీ సభ్యులు కర్లపాటి వెంకట శ్రీనివాసరావు తన మాతమూర్తి సైదమ్మ వర్థంతిని పురస్కరించుకొని గురువారం పలువురు పేదలకు, ట్రస్ట్ సిబ్బందికి నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. పేద విద్యార్థికి 3 వేల రూపాయల సహాయాన్ని అందించారు. పి4 లో భాగంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ టి ఎల్ ఎఫ్ కు ఇనుప బీరువాను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు రాజారావు, శ్రీదేవి, భారతి, రాయపూడి వెంకటేశ్వరరావు, ట్రస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి : జడ్జి

ప్రజాశక్తి-మైలవరం : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ పిలుపుమేరకు డిసెంబర్ 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్, మైలవరం జూనియర్ సివిల్ జడ్జి ఏం శైలజ పిలుపునిచ్చారు. జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని గురువారం స్థానిక సివిల్ జడ్జి కోర్టు హాల్లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా కక్షిదారులను చైతన్యం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



బస్ కండక్టర్‌పై దాడికి నిరసన



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఈ నెల 17న జగ్గయ్యపేట నుండి కోదాడ వెళ్లే ఇంటర్ స్టేట్ సర్వీసు డ్యూటీ చేస్తున్న కండక్టర్ షేక్ ఖాదర్ సాహెబ్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం జగ్గయ్యపేట డిపో కమిటీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించి, నిరసన తెలిపారు. అనంతరం ఆర్టీసీ అధికారులకు, ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్, మాజీ మంత్రి నెట్టం రఘురామ్‌కు మెమోరాండం సమర్పించారు. డ్యూటీలో ఉన్న ఉద్యోగులకు రక్షణ కల్పించాలని, డిపోలో ఉన్న అనేక పెండింగ్ సమస్యల పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పసుపులేటి శ్రీనివాస్, డిపో అధ్యక్షులు కల్యాణం కృష్ణారావు, జిల్లా నాయకులు షేక్ హిమామ్, డిపో కార్యదర్శి ఎ.ఆనంద్, డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జె సాంబశివరావు, షేక్ జిలాని పాల్గొన్నారు.

మహిళ నేత్ర దానం




ప్రజాశక్తి-గంపలగూడెం: మండలంలోని పెద్ద కొమెర తోటమూలకు చెందిన శీలం చెంచులక్ష్మి (55) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. లైన్స్ క్లబ్ ప్రతినిధి గోగిరెడ్డి కృష్ణారెడ్డి అభ్యర్థన మేరకు నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఈ మేరకు విజయవాడ ఎల్వి ప్రసాద్ ఆసుపత్రి వైద్య బృందం నేత్రాలను స్వీకరించారు.

నేడు ఎల్ఎస్‌డిజి శిక్షణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: కృష్ణా జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఎల్ఎస్‌డిజి థీమ్-5- క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌కు సంభందించి ఈ నెల 21న మండల స్థాయి ఒక్క రోజు శిక్షణా కార్యక్రయం మండలంలోని చిల్లకల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని మండల అభివృద్ధి అధికారి జి నితిన్ తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం మండల రిసోర్స్ కోఆర్డినేటర్స్ (ఆర్డబ్ల్యూఎస్ , గ్రీన్ అంబాసిడర్స్, గ్రీన్ గార్డ్సులకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని తెలిపారు.

గుండెపోటుతో విఆర్‌ఒ మృతి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: త్రిలోచనాపురం విఆర్‌ఒగా పని చేస్తున్న ఎం వెంకటేశ్వరావు (55) గుండెపోటుతో గురువారం మరణించారు. తాడి గడపలో నివసిస్తున్న ఆయనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇబ్రహీంపట్నం రెవిన్యూ సిబ్బంది నివాళులు అర్పించారు.



స్వామిత్వ సర్వేలో అభ్యంతరాలు తెలపాలి



ప్రజాశక్తి-గంపలగూడెం: స్వామిత్వ సర్వేలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియచేయాలని గంపలగూడెం తాశీల్దార్, ఎంపీడీవో వడ్డేశ్వరపు రాజకుమారి, టి.సరస్వతి కోరారు. ఈ మేరకు గురువారం నెమలి గ్రామ సచివాలయం వద్ద కార్యదర్శి కొంగల అశోక్ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈ కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ.. ఇప్పటికే పూర్తయిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తుండగా, మిగిలిపోయిన సమస్యలపై అభ్యంతరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు కోట శామ్యూల్, గ్రామ సర్పంచ్ దుబ్బాకుల రామకృష్ణ, పాల్గొన్నారు.

నేరగాళ్ల కదలికలపై నిఘా అవసరం



ప్రజాశక్తి - తిరువూరు : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి, ప్రతి గ్రామ సమాచారాన్ని సేకరించాలని ఎస్ఐ సత్య నారాయణ మహిళా సమరక్షణ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చారు. తిరువూరు పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయన మహిళా సమరక్షణ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. సంబంధిత ప్రాంతాల్లో రౌడీ షీటర్ల, నేరగాళ్ల కదలికలపై నిఘా పెట్టాలని చెప్పారు. అక్రమ ఇసుక రవాణా చేసే వారిని గుర్తించాలని, సంఘటిత జూదాలను అరికట్టాలని తెలిపారు. గ్రామాల్లో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

గంపలగూడెం: గత వారం రోజులుగా జరుగుతున్న 58వ గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా గంపలగూడెం, పెనుగొలను శాఖల పరిధిలో నిర్వహించిన సాంస్కృతిక, వకృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గంపలగూడెం గ్రంథాలయ శాఖలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎఎంపి చైర్మన్ రేగళ్ల లక్ష్మీ అనిత, గ్రామ సర్పంచ్ కోట పుల్లమ్మ తదితరులు పాల్గొని విజేతలైన 40 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలతోపాటు ప్రోత్సాహకాలు అందజేశారు. అదేవిధంగా పెనుగొలను శాఖలో గ్రామ సర్పంచ్ సంగెపు లలిత కుమారితో పాటు పలువురు పెద్దలు పాల్గొని బహుమతులు అందించారు. గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేసిన విశ్రాంత ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రోత్సాహకాలకు సహకరించిన దాతలకు ఆయా ఇన్చార్జిలు దొండపాటి జ్యోతిర్మయి, తెనాలి వెంకటేశ్వర్లులు కృతజ్ఞతలు తెలిపారు.


చందర్లపాడు: చందర్లపాడు తృతీయ శ్రేణి శాఖ గ్రంథాలయంలో 'గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎస్‌వికెఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఏడురోజుల పాటు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్, వార్యసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయశాఖాధికారి షేక్ కరీముల్లా, స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు విభాగాధిపతి కె.శివ నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట గ్రేడ్ వన్ గ్రంథాలయంలో కృష్ణా జిల్లా గ్రంథాల సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, జగ్గయ్యపేట మున్సిపాలిటీ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, 10వ వార్డు కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి పాల్గొన్నారు. సభాధ్యక్షులుగా డాక్టర్ వడ్డేపల్లి శ్రీనివాస్‌రావు వ్యవహరించారు. ఈ సందర్భంగా వివిధ రకాల ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులను ఎమ్మెల్యే రాజగోపాల్ అందజేశారు. గ్రంథాలయ అధికారి షేక్ మస్తాన్ వలి పాల్గొన్నారు.

గంపలగూడెం రాయి మండల పరిషత్ ఆదర్శ పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం గ్రంథాలయ రికార్డ్ అసిస్టెంట్ వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం రమేష్ బాబు గ్రంథాలయ వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యాన్ని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బారావు, దేవదానం, పద్మావతమ్మ, ముక్తేశ్వరావు, ఆయా వెంకటరావమ్మ, పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం:** జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా కొండపల్లి పట్టణ శాఖా గ్రంథాలయంలో సభ నిర్వహించారు. ఈ సభకు జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు పెట్ల కామేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి అతిధులుగా కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, కౌన్సిలర్‌లు చుట్టుకుదురు వాసు, చనుమోలు నారాయణ, ఉప్పుతల గోపాలరావు పాల్గొని వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎ.నరసింహరాజు, వెంకటేశ్వరరావు, పి ఆర్ బాలకృష్ణ, గ్రంథాలయ అధికారి డి. చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో...



గంపలగూడెంలో బహుమతులు అందిస్తున్న లక్ష్మీ అనిత

మైలవరం : మైలవరం శాఖ గ్రంథాలయంలో గత వారం రోజులుగా జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రవాస భారతీయురాలు, రచయిత్రి పద్మ మాట్లాడుతూ గ్రంథాలయాలలో అనేక రకాల పుస్తకాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె రాసిన గ్రామ దేవత పుస్తకాన్ని గ్రంథాలయానికి అందజేశారు. వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధ్యక్షురాలు కోయసుధ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎల్ బి ఆర్ సి గ్రంథ పాలకులు సాంబశివరావు, విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందిగామ : నందిగామ పట్టణంలోని స్థానిక గ్రంథాలయం ప్రాంగణంలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య గ్రంథాలయ అభివద్ధికి పుస్తకాల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం నూతనంగా మంజూరైన కంప్యూటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయం చైర్మన్ భండారు హనుమంతరావు, ఎఎంసి వైస్ చైర్మన్ అమ్మినేని జ్వాలా ప్రసాద్, గ్రంథాలయం అధికారి రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.



అనుమతిలేకుండా వరి సాగు చేయొద్దు : తహశీల్దార్

ప్రజాశక్తి- మచిలీపట్నం రూరల్ : అనుమతి లేకుండా డ్రైనేజీ నీటితో సాగు చేయడం మంచిది కాదని మచిలీపట్నం నార్త్ తహసిల్దార్ నాగభూషణం రైతులకు సూచించారు. మచిలీపట్నం మండలంలోని బుద్దాల పాలెం, బొర్రపోతుపాలెం గ్రామాలలో రైతులతో వరి పండించే భూములను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెడన గ్రామానికి చెందిన కొద్ది మంది రైతులు ప్రభుత్వం అనుమతించ కపోయినా ఈ సంవత్సరం రబి వరి సాగు చేస్తుండటంతో ఆందోళన చెందుతున్న బుద్దాలపాలెం, బొర్ర పోతుపాలెం రైతులు 45 మంది భూములు మినుము పంట సాగు చేయుటకు చౌడు అధికంగా చేరి పంట భూములు సాగుకు పనికి రాకుండా పోతున్నాయని జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్కి తెలియజేశారన్నారు. మండల సరిహద్దు కావడంతో ఆందోళన చెందుతున్న బుద్దాలపాలెం ,బొర్రపోతుపాలెం రైతుల సమక్షంలో అప్పటికప్పుడు పెడన గ్రామ రైతులను పిలిపించి సాగు చేయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈఈ హరీష్, డిప్యూటీ ఇంజనీర్ వి ఎస్ వి ఎల్ అపర్ణ, మచిలీపట్నం మండల వ్యవసాయ అధికారి ఎం రామ కుమార్, వీఎఓ శిరీష, వీఆర్ఓ మోహన్‌రావు, బుద్దాల పాలెం గ్రామ సర్పంచ్ డి బాబురావు పాల్గొన్నారు.

నేడు ఉంగుటూరులో ప్రజాదర్బార్

ప్రజాశక్తి-ఉంగుటూరు : ఉంగుటూరులో మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు మండల స్థాయి ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామనిఎంపీడీఓ ఇ సత్య కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు పాల్గొంటారని, మండలంలోని గ్రామాల ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిరాడంబర నాయకుడు చంద్ర రాజేశ్వరరావు

- సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి-చల్లపల్లి : భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ నాయకులు చంద్ర రాజేశ్వరరావు నిరాడం బర నాయకులని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. చంద్ర రాజేశ్వరరావు పుట్టిన కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం మంగళాపురం గ్రామాన్ని గురువారం ఆయన సందర్శించారు. రాజేశ్వరరావు నివసించిన గృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సంపన్న వర్గంలో పుట్టిన రాజేశ్వరరావు తన యావదాస్తిని పేద ప్రజలకు ఖర్చు చేశారని అన్నారు. దున్నేవాడికే భూమి దక్కాలనే నినాదంతో చల్లపల్లి జమిందార్లకు వ్యతిరేక పోరాటం సాగించి, పేదలకు భూములకు



చంద్ర రాజేశ్వరరావు నివసించిన గృహం పరిశీలిస్తున్న రామకృష్ణ

పంచిన చరిత్ర ఆయనకు దక్కిందన్నారు. సంపన్న కుటుంబంలో జన్మించిన ఆయన పూరి ఇంట్లో నివసించడం అంటే ఆయన నిరాడంబరతకు నిదర్శనమని కొనియాడారు. అంతటి మహానుభావుడు జన్మించిన ప్రదేశాన్ని సందర్శించడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. బుద్ధగ జమిందార్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు ఉన్నారు.

ఆకట్టుకున్న 'మహా పురుషుడు మండలి' నాటకం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో 1977 తుఫాను మృతుల సంస్మరణ , ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి మండలి వెంకటకృష్ణారావు శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం రాత్రి అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో ప్రదర్శించిన మహాపురుషుడు మండలి నాటకం ప్రేక్షకులను కట్టిపడేసింది. అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారిచే గంగోత్రి సాయి దర్శకత్వంలో డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్ రచించిన ఈ మహాపురుషుడు మండలి నాటకంలో కృష్ణారావు యుక్త వయసులో ఎంపీగా ఎన్నిక కావడం, ఎమ్మెల్యేగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం, ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణ, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా చేసిన పనులు, తదితర ఘట్టాలను అద్భుతంగా ప్రదర్శించారు. దర్శకుడు, నటుడు గంగోత్రి సాయి కృష్ణారావు పాత్రకు ప్రాణం పోశారు. ఈ సందర్భంగా కళాకారులను ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ ,విజయలక్ష్మి దంపతులు, నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ ఘనంగా సత్కరించారు.

రాజ్యాంగ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : ఈనెల 26న భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని కోరుతూ దళిత సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురువారం మచిలీపట్నంలోని స్థానిక ఎస్ కన్వెన్షన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత జెఏసి నాయకులు మాట్లాడుతూ ఈ నెల 26 న ఉదయం 9 గంటలకు లక్ష్మీ టాకీస్ సెంటర్‌లోని డా. బి ఆర్ అంబేద్కర్ సర్కిల్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ఘన నివాళులు అర్పించి ర్యాలీ నిర్వ హించి పరాసుపేట లోని సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ పక్కన గాడెల్లి డేవిడ్ శామ్యూల్ తన స్థలంలో నిర్మించిన దళిత భవన్‌ను 10 గంటలకు ప్రారంభం జరుగుతుందని తెలిపారు. ముఖ్య అతిథులతో ఆత్మీయ సమావేశం అనం



తరం ఆత్మీయ విందు (వనభోజనాలు) ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి ఎస్సీ,ఎస్టీ, క్రిస్టియన్ మైనారిటీలకు చెందిన ప్రతి వాళ్ళరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. దళిత జేఏసీ జిల్లా అధ్యక్షుడు జక్కుల ఆనందబాబు (జానీ), అర్బన్ బ్యాంక్ వైస్‌చైర్మన్ వంపుగడవల చౌదరి, టిడిపి ఎస్సీ విభాగం నాయకుడు చిట్టూరి యువరాజు, కార్పొరేటర్ ఏకసిరి వెంకటేశ్వ రరావు, కో ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి పాల్గొన్నారు.



కార్తీక వనసమారాధన

ప్రజాశక్తి మోపిదేవి : మోపిదేవి మండలం వార్పు గ్రామంలో తెలుగుదేశం పార్టీ నిర్వహించిన కార్తీక వనసమారాధన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఇంచార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ , మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ రావు, కొమ్మారెడ్డి పట్టాభి, అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, సీనియర్ నేత బొబ్బా గోవర్ధన్, ఎమ్మెల్సీ అశోక్ బాబు, రావి నాగేశ్వరరావు, బండే శ్రీనివాసరావు, మండవ బాలవర్ధనరావు, తదితరులు పాల్గొన్నారు. వాన సమారాధనకు విచ్చేసిన మంత్రులు ముఖ్య నేతలను అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం కుటుంబం ఘనంగా సన్మానించింది. అవనిగడ్డ నియోజకవర్గానికి చెందిన ఆరు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

వాయుగుండం హెచ్చరికతో రైతుల ఆందోళన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : వాయుగుండ హెచ్చరికతో వరి రైతులు తమ గూటికి ధాన్యాన్ని తీసుకెళ్లి భద్రపరుచుకునే పనుల్లో తలమునకలవుతున్నారు. కూలీలతో కోతలు కోయి చి... కట్టేత కట్టి... కుప్ప నూర్చి...బస్తాలకు ఎత్తేంత సమయం లేకపోవ టంతో రైతులు వరికోత యంత్రాలను కోతలు కోయిస్తున్నారు. వరికోతల ప్రారంభంలో కోత మిషనుకు గంటకు రూ.4వేలు మాత్రమే తీసుకునేవారు. కాని ప్రస్తుతం హార్వెస్టర్ల యజమా నులకు గంటకు రూ.5వేలు చెల్లించి కూడా రైతులు కోతలు కోయించుకుం టున్నారు. తుపాను వస్తే గింజలు పాడవుతాయని, రైస్ మిల్లులకు తమ ధాన్యం సిరులను చేర్చుకుంటే చాలు అన్నట్లుగా రైతులు ఎన్నో వ్యయప్రయాసలకోరుస్తున్నారు.



ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-పామర్రు : గ్రంథాలయ వారోత్స వాల ముగింపు కార్యక్రమం పామర్రు గ్రేడ్ 2 శాఖ గ్రంథాలయంలో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం బి లక్ష్మి భవితా కేంద్రం ఉపాధ్యా యులు కె మరియన్న ముఖ్య అతిథులుగా పాల్గొని వారోత్సవాలలో వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందించారు. గ్రంథాలయ అధికారిని ఎం ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు. మండల పరిధిలోని జమీ గొల్వేపల్లిలో జరిగిన వారోత్సవాల్లో గ్రంథాలయ అధికారి వి.నాగరాజు, ఎంపీటీసీ సభ్యులు ఎర్నేని అరవింద్ బాబు, సర్పంచ్ రాయవరపు శాంతకుమారి పాల్గొన్నారు. ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ప్రథమ శ్రేణి గ్రంథాల యంలో వారోత్సవాల ముగింపు సభలో బుద్ధ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. వివిధ పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందించారు. నవజీవన్ విద్యాసంస్థల అధినేత కొండవీటి ఈశ్వరరావు, విశ్రాంతి ఉపాధ్యాయులు గుడిసేవ విష్ణు ప్రసాద్, గ్రంథాలయ అధికారి ఆలేటి ప్రభ పాల్గొన్నారు.ప్రజాశక్తి ఉయ్యూరు : స్థానిక ఏసీ గ్రంథాలయంలో జరిగిన ముగింపు సభలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొండ ప్రవీణ్ పాల్గొని విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, పలువురు పుర ప్రముఖులు పాల్గొన్నారు. మండలంలోని కాటూరి శాఖ గ్రంథాలయంలో జరిగిన ముగింపు వేడుకల్లో బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోమల గ్రంథాలయం అధికారి శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు. ప్రజాశక్తి-మొవ్వ: ఈనెల 14వ తారీకు నుంచి వారం రోజులపాటు నిర్వహిం చిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. మొవ్వ తృతీయ శ్రేణి శాఖ గ్రంథాలయంలో వారం రోజులు పాటు పలు అంశాలలో నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. గ్రంథాల య పాలకులు తూములూరి కష్ణకుమారి ఆధ్వర్యంలో కార్యక్రమంలో సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, ఎంపిపి కొండేటి ఇందిర, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు డాక్టర్ వేమూరి పరిశుద్ధ రాజు, ఎంఈఓ-2 కే శ్రీలక్ష్మి, హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు నిమ్మగడ్డ ఉమాశ్రీ పాల్గొన్నారు. ప్రజాశక్తి-ఉంగుటూరు : మండలంలోని మానికొండ, ఉంగుటూరు, ఆత్కూరు గ్రంథాలయాలలో వారోత్సవాలు ముగిశాయి. ఎంపిపి వడ్లమూడి సరోజినీ, ఎంపిడిఓ ఇ సత్యకుమార్, ఎంఈఓ జె. సాంబశివరావు, ఆత్కూరు పిహెచ్ సి వైద్యులు, ఎపిటిసి ఆర్వేపల్లి సింహాచలం, తదితరులు పాల్గొని మాట్లాడారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. మానికొండ, ఆత్కూరు, ఉంగుటూరు గ్రంథాలయ అధికారులు హరికృష్ణ, బివి కిష్టారావు, యు చంద్రశేఖరరావు పాల్గొన్నారు.ప్రజాశక్తి-పమిడిముక్కల : పమిడిముక్కల మండలంలోని మేడూరు గ్రంథాలయంలో ముగింపు ఉత్సవాల్లో ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పమిడిముక్కల గ్రంథాలయాధికారి షరీఫ్, మేడూరు గ్రంథాలయ కార్యదర్శి బొబ్బ లావణ్య, పెనుముచ్చ గ్రంథాలయ అధికారి సుబ్బారావు, అగ్నిపర్రు గ్రంథాలయాధికారి సుబ్రహ్మణ్యం, గురజాల గ్రంథాలయాధిధికారి సాంబశివరావు పాల్గొన్నారు. ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం) : గన్నవరం గ్రేడ్-1 గ్రంథాలయంలో జరిగిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొని మాట్లాడారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. గ్రంథాలయ కమిటీ అధ్యక్షులు నర్రా సీతారామారావు, గన్నవరం సర్పంచ్ పాలడుగు నాని, మాజీ సర్పంచ్ గూడపాటి తులసీమోహన్, ఎంపిటిసి పడమట రంగారావు, మద్దినేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ప్రజాశక్తి-కోడూరు : కోడూరు శాఖ గ్రంథాల యంలో పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి, జడ్పిటిసి యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, కోడూరు పిఎసిఎస్ చైర్మన్ పూతబోయిన కరుణ కుమార్, వైసిపి రైతువిభాగం కార్యదర్శి కొండవీటి వెంకటనారాయణ పాల్గొన్నారు. ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి శాఖ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి కె. గణేష్ కుమార్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బివి తాతారావు,బి పాండురంగారావు పాల్గొన్నారు. ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు, అంగలూరు, కౌతవరం గ్రంథాలయాల్లో వారోత్సవాల ముగింపు సభలో విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వైపీసీ ప్రసాద్, ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్, ఎంఈఓ జి.గోపాలరావు, గ్రంథాల యాధికారులు టి.వాణి, పి.వి.వి.పద్మజ, బి.బాలాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు శాఖ గ్రంథాలయంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా కోసూరి శ్రీనివాసరావు (గురుస్వామి) డి అప్పారావు, టి శేషు బాబు,ఎం మల్లేశ్వర రావు, చిత్రా, గ్రంథాలయ నిర్వాహకులు రామకృష్ణ పాల్గొన్నారు.



పమిడిముక్కలలో...



ఘంటసాలలో...

ప్రజాశక్తి ఘంటసాల : ఘంటసాల శాఖ గ్రంథాలయంలో జరిగిన ముగింపు ఉత్సవాల్లో ఘంటసాల ఏ ఎం సి చైర్మన్ తోట కనకదుర్గ ముఖ్యఅతిథిగా పాల్గొని వివిధ క్రీడల్లో విజేతలైన వారికి బహుమతులు అందించారు. ఘంటసాల వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సత్యప్రియ లలిత, ఘంటసాల గ్రంథాలయ అధికారి ఎం శరత్ కుమార్, ప్రముఖులు యార్ల శ్రీకాంత్, విశ్రాంత ఎంఈఓ పోతన వెంకటేశ్వరరావు, ఘంటసాల జడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు .ప్రజాశక్తి - గుడివాడ : షా గులాబ్ చంద్ ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో జరిగిన ముగింపు ఉత్సవంలో ఎంఈఓ-2 బాలాజీ పాల్గొనివివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. బహుమతులు సమకూర్చిన డి.వి సత్యనారాయణ, సయ్యద్ గఫార్, తెలుగుభాషా వికాస సమితి సమన్వయకర్త డిఆర్‌బి ప్రసాద్, గ్రంథాలయ అధికారి ఎం.వి.డి.టి నగేష్ పాల్గొన్నారు.

తానిషా ఆంగ్ల నవల ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : మొబైల్ వాడక సమయం తగ్గించుకొని యువతరం సృజన పెంపొందించుకోవాలని ఎన్టీఆర్ జిల్లా డిప్యూటీ పోలీసు కమిషనర్ (అడ్మిస్ట్రేషన్) కెజివి సరిత అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం సిద్ధార్థ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో రచయిత్రి తానిషా కాజా నవల ఏ టేల్ ఆఫ్ లైస్‌ను సరిత ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సాంకేతికతకు బానిస కాకుండా, అంతర్లీన ప్రతిభ వెలికితీయాలని, గుర్తింపు తెచ్చుకోవాలని, మానసిక ఆరోగ్యం కలిగి ఉండాలన్నారు. ఈ నవల ఇతివృత్తం అమ్మాయి అపహరణ నేపథ్యంగా సాగుతుందని, పోలీసుశాఖలో మహిళల సంఖ్య తక్కువని, అయితే ఈ నవలలో ఒకానొక ముఖ్యపాత్ర మహిళా పోలీసు అధికారిణి కావడం, విధినిర్వహణలో ఆమెకు ఎదురైన సవాళ్లను, విలువలను స్పృశిస్తూ ఈ నవల సాగుతుందంటూ రచయిత్రిని అభినందించారు. ప్రిన్సిపాల్స్ డాక్టర్ మేకా రమేశ్, సిహెచ్. వెంకటేశ్వర్లు, డీన్ ఆచార్య రాజేశ్ సి.జంపాల, ఎడ్యు కన్సల్టెంట్ సుంకర నాగభూషణం, రచయిత పాపినేని సాయి, గ్రంథ పాలకురాలు వాణి మాట్లాడుతూ అతిపిన్న వయసులో నవలా రచన ప్రారంభించిన తానిషాను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.



విద్యార్థులు స్వీయ క్రమ శిక్షణ అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : విఎంసి పాఠశాలలలో విద్యార్థులను చేర్పించడంతోపాటు పదవ తరగతిలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచడంలో విశేష కృషి చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుల సేవలు ఎనలేనివని 53వ డివిజన్ కార్పొరేటర్ మహాదేవు అప్పాజీ రావు అన్నారు. మౌలానా ఆజాద్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో విద్యాభివద్ధికి పాటుపడిన డిఎస్సీ 2000 బ్యాచ్ ఉపాధ్యాయుల రజతోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహాదేవు అప్పాజీరావు పాల్గొని ఉపాధ్యాయులను సత్కరించారు. రాబోయే రోజుల్లో మౌలానా ఆజాద్ ఉర్దూ ఉన్నత పాఠశాలను అభివద్ధి పదంలో తీసుకువెళ్లాలని, పదవ తరగతి ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె కళ్యాణి, ఇతర ఉపాధ్యాయ బృందం 25 సంవత్సరాల్లో విద్యావ్యవస్థలో వచ్చిన సంస్కరణల గురించి, సాధించిన విజయాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు కుద్దూస్ ఖాన్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. మౌలానా ఆజాద్ ఉర్దూ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు శ్రీ రామ కష్ణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



పది వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : కార్తీక మాసం ముగింపు సందర్భంగా శ్రీ దర్భేశ్వర స్వామి వారి దేవస్థానంలో 10 వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించినట్లు దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త రాంపిళ్ళ జయప్రకాష్ చెప్పారు. గురువారం కొత్తపేట సైకం వారివీధిలో ఉన్న శ్రీదర్భేశ్వరస్వామి దేవస్థానం వద్ద అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని రాంపిళ్ళ జయప్రకాష్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ.. కార్తీకమాసం సందర్భంగా శ్రీ ధర్బేశ్వరస్వామిని నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుంటారని తెలిపారు. దేవస్థానానికి విచ్చేసే భక్తులను దష్టిలో పెట్టుకొని అన్ని సదుపాయాలను కల్పించడం జరిగిందన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినందుకు పోలీసు అధికారులకు అభినందనలు తెలిపారు. అలాగే శుక్రవారం ఉదయం 6:30 గంటలకు దేవస్థానం వద్ద 2000 మంది పేదలకు అన్నదానం నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ సివిలైజేషన్ గాంధీ ట్రస్ట్ డైరెక్టర్లు తమ్మిన సోనియా, తమ్మిన హనుమ, ప్రముఖ వ్యాపారవేత్తలు తమ్మిన యజ్ఞేశ్వర రావు (మారుతి), తమ్మిన అవినాష్ , స్వామి వారి భక్తురాలు తమ్మిన సూర్యకుమారి పాల్గొన్నారు.



ప్రజా విశ్వాసానికి సంరక్షకులుగా పనిచేద్దాం

- ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతి ప్రియ



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఆధునిక సాంకేతికతతో వినూత్న ఆడిట్ పద్ధతులను అవలంబిస్తూ భవిష్యత్‌కు బాటలు వేసేలా మానవవనరులను తీర్చిదిద్దుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఎఅండ్ ఈ) ఎస్.శాంతి ప్రియ తెలిపారు. గురువారం స్థానిక స్టాలిన్ బిల్డింగ్ 8వ అంతస్తులోని మల్టీపర్పస్ హాల్‌లో శాంతి ప్రియ చేతుల మీదుగా 5వ ఆడిట్ దివస్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధునాతన సాంకేతికతలైన ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి సేవలను పరిపాలనలో వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా విశ్వాసానికి సంరక్షకులుగా ప్రజా వనరులను సక్రమంగా వినియోగిస్తూ పనిచేయాలన్నారు. సమాజంలో సమున్నత మార్పులకు నాయకత్వం వహించడం, విలువలు పునరుద్ధాటించడం, విశ్వాసం, ఆవిష్కరణ, సుస్థిరత, జవాబుదారీతనం లక్ష్యంగా పనిచేయాలన్నారు. జ్యోతి ప్రజ్వలనతో వేడుకలు ప్రారంభించిన తర్వాత పరిపాలన, పారదర్శకత, జవాబుదారీతనంలో కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్) పాత్రను, చేస్తున్న కషిని వివరించారు. డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ (ఏఎంజీ-3) సుష్మా మాట్లాడుతూ భారత కంప్ట్రోలర్, ఆడిట్ జనరల్ నాయకత్వంలో నిర్వహిస్తున్న ఈ వేడుకలు వ్యవస్థ నిర్మాణంలో గణనీయమైన పాత్ర పోషించనున్నాయని తెలిపారు. 5వ ఆడిట్ దివస్ వేడుకల్లో భాగంగా క్విజ్ పోటీలు, ఆర్ అండ్ ఐ వర్క్ షాప్, డ్రాయింగ్ పోటీలు, ఎయిమ్స్ ద్వారా వైద్య ఆరోగ్యం, స్వయం ఆర్థిక వృద్ధిపై చర్చలు, ఆడిట్, అకౌంట్స్ వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ (ఆడిట్) ఆర్.శ్యామ్, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ (అడ్మిన్) వి. లలిత్ కుమార్, సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ కుశాల్, నాబార్డ్ జీఎం మహేష్ సింగ్, ఆర్బీఐ డీజీఎం అనంతీ, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్స్ విజయవాడ డైరెక్టర్ రమేష్ శ్రీకొండా, కేంద్ర ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖాధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాలకు వేలం

ప్రజాశక్తి-మైలవరం : ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ మైలవరం పరిధిలోని వివిధ కేసులలో పట్టుబడిన ఐదు వాహనాలకు పొందుగల రోడ్డు మైలవరం ఎక్సైజ్ స్టేషన్లో శుక్రవారం వేలంపాట నిర్వహించటం జరుగుతుందని మైలవరం ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు పూర్తి వివరాల కోసం ఎక్సైజ్ స్టేషన్ మైలవరం నందు సంప్రదించాలని కోరారు.

150 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక పుల్లగూర ప్రభాకర్ రావు ఆసుపత్రిలో విజయవాడ కు చెందిన డాక్టర్ ఎంజే నాయుడు ఆసుపత్రి నిర్వాహకులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎముకల, కీళ్ళ వ్యాధులకు సంబందించిన వైద్యులు డాక్టర్ సందీప్, డాక్టర్ జాఫర్, డాక్టర్ ఎం వల్లభ 150 మంది రోగులకు ఎముకలు, కీళ్ళ కు సంబందించిన వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమం లో లయన్ డాక్టర్ పుల్లగూర ప్రభాకర్ రావు, ప్రసాద్ కోనేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసులకు ట్రాఫిక్ బారికేడ్లు అందజేత

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ

మ్యాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి (విజయవాడ) నగరంలో ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. కొత్తగా తయారు చేసిన ట్రాఫిక్ బారికేడ్లను విజయవాడ సిటీ ట్రాఫిక్ పోలీసులకు మ్యాక్సీవిజన్ ఆసుపత్రి బృందం అందజేసింది. ఈ బారికేడ్లు ఎక్కువ రద్దీ ఉన్న చోట్ల ట్రాఫిక్‌ను నియంత్రించడానికి, అలాగే రద్దీ సమయాల్లో రోడ్డు భద్రతను పెంచడానికి పోలీసులకు ఉపయోగపడతాయని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామకృష్ణ అన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర భద్రత, క్రమశిక్షణ కోసం కష్టపడుతున్న పోలీసులకు తమ సహాయం అందించడానికి ఈ పని చేశామని చెప్పారు. ఈ కార్యక్రమానికి ఏసీపీ ఎస్.ఆర్.వంశీధర్ గౌడ్, ట్రాఫిక్ సీఐ వై.రవి కుమార్ హాజరయ్యారు. మ్యాక్సీవిజన్ సహకారాన్ని ఈ సందర్భంగా వారు అభినందించారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడ : రమణ కల్చరల్ ఆర్ట్స్, గణేష్ సేవా సమితి, పోలవరపు సాంస్కృతిక సమితి సంయుక్త నిర్వహణలో... గురువారం రాత్రి గాంధీనగర్ వి. హెచ్.గ్రంథాలయంలో "గాన గంధర్వులు ఘంటసాల వెంకటేశ్వరరావు స్వర రాగార్చన" సినీ సంగీత విభావరి ఉల్లాసంగా జరిగింది. రమణ కల్చరల్ ఆర్ట్స్ అధ్యక్షుడు మాంత్రి రమణారావు ఆధ్వర్యంలో పలువురు గాయకులు ఘంటసాల సినిమా పాటలతో జన రంజకంగా ఆలపించారు. చింతలపాటి సురేష్ (బహుగళ గాయక కంఠీరవ- హైదరాబాద్), రమణ పాత్రో (అపర ఘంటసాల), శాంతమూర్తి, కొమ్మినేని రత్నకుమారి (నేషనల్ అవార్డీ), సుమలత, బొబ్బిలి మల్లేశ్వరి, కే డేవిడ్ రాజు, ఎం.శ్యామ్ ప్రసాద్, స్వాతి.ఎం తదితరుల గాయనీ గాయకుల్ని.. మొత్తంగా ప్రేక్షకుల్ని రవి (కీబోర్డ్), రమణ (ప్యాడ్స్), వెంకట్ (తబల), ఎ.రామ్మోహనరావు (రిథం), బ్రూస్లీ (సౌండ్స్) సహకారం ఉత్తేజపరిచింది. కార్యక్రమానికి అతిథులుగా మా ఆర్ట్స్ బాబి, వెంకటేశ్వరరాజు, రాఘవ రాజు, ప్రముఖ గాయకుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. సంస్థ ఉపాధ్యక్షుడు జనాబ్ సయ్యద్ యాకూబ్ కూడా కార్యక్రమ నిర్వహణలో పాలు పంచుకున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు పరిశీలన



ప్రజాశక్తి - రెడ్డిగూడెం :రెడ్డిగూడెం మండలం లోని మద్దులపర్వ, కునపరాజుపర్వ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలాకీయా, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.మాధురి పరిశీలించి, రైతులకు అవగాహ కల్పించారు. 24 గంటలలో ప్రభుత్వం నుండి రైతులుకు డబ్బు జమవుతుందని తెలిపారు. రైతులు రైతు సేవా కేంద్రంలో ధాన్యం విక్రయించ విక్రయించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో రెడ్డిగూడెం తహసిల్దార్ జె.సుశీలదేవి, ఏవో శ్రీనివాసరావు, నాయకులు మోహన మురళీ రెడ్డి, రాయుడు వెంకటేశ్వర రావు మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గంధం పుల్లయ్య, ఏ.ఈ.ఓ శ్రీను నాయక్, దివ్య, వి.ఆర్.ఓ.తరుణ్, రాజేష్ పాల్గొన్నారు.

జోనల్ హిందీ నాటిక పోటీల్లో విజయవాడ డివిజన్‌కు మొదటి స్థానం



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ఈ నెల 17, 18 తేదీల్లో సికింద్రాబాద్ రైల్ నిలయంలో జరిగిన ప్రతిష్టాత్మక జోనల్ హిందీ నాటిక పోటిల్లో విజయవాడ డివిజన్ మొదటి బహుమతిని గెలుచుకుంది. విజయవాడ రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన హిందీ నాటకం అఖండ్ పర్వ్ ప్రేక్షకులను, న్యాయనిర్ణేతలను విశేషంగా ఆకర్షించింది. విస్తృత ప్రశంసలను పొందడంతోపాటుగా ఉత్తమ దర్శకత్వంతో సహా పలు విభాగాలలో తొమ్మిది వ్యక్తిగత అవార్డులను గెలుచుకుంది. ఉత్తమ లైటింగ్, ఉత్తమ సౌండ్ ఎఫెక్ట్స్, ఉత్తమ కాస్ట్యూమ్స్, ఉత్తమ మేకప్, ఉత్తమ సంగీతం, ఉత్తమ స్టేజ్ డెకరేషన్, ఉత్తమ సహనటుడు, ఉత్తమ నటిగా ప్రత్యేక అవార్డులను సొంతం చేసుకుంది. నవంబర్ 18న సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జరిగిన బహుమతి పంపిణీ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఈ అవార్డులను అందజేశారు. విజయవాడ డివిజన్ మెయిల్ ట్రైన్ మేనేజర్ ఎం. గోపాల్ కష్ణ దర్శకత్వం వహించిన ఈ నాటకంలో విజయవాడ డివిజన్‌లోని వివిధ విభాగాల సిబ్బంది అత్యుత్తమ ప్రదర్శనలు ఇచ్చారు. వారి అంకితభావం, జట్టుకృషి నిర్మాణం నిర్మాణాన్ని జీవం పోసింది, ప్రశంసలను సంపాదించింది మరియు శ్రేష్ఠతకు ఒక ప్రమాణాన్ని నెలకొల్పింది. ఈ విజయంతో, "అఖండ పర్వ్" రాబోయే అఖిల భారత హిందీ నాటక పోటీలో దక్షిణ మధ్య రైల్వేకు ప్రాతినిధ్యం వహిస్తుంది, జాతీయ వేదికపై డివిజన్ ప్రతిభను ప్రదర్శిస్తుంది. విజయవాడ డిఆర్ఎం మోహిత్ సోనాకియా, ఏ డి ఆర్ ఎం (ఇన్ఫ్రా) పి.ఇ. ఎడ్విన్, ఏడిఆర్ఎం (ఆపరేషన్స్) డి. శ్రీనివాసరావు సహా అన్ని బ్రాంచ్ అధికారులు బందం సాధించిన ఈ అద్భుతమైన విజయానికి ప్రశంసలు తెలిపారు. సీనియర్ రాజభాష అధికారి హేమంత్ వాడేకర్ రాజభాష సిబ్బంది కూడా తమ మద్దతును అందించారు.



